www.prajanaava.in
Telugu Daily
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 185 | ఆదివారం | 28 జూన్, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 9014966169

కోలుకోని వెనిజులా

1,430కు చేరిన భూకంప మృతుల సంఖ్య.. 68,900 మంది ఆచూకీ గల్లంతు

- లా గ్వైరాలో విషాద దృశ్యాలు
- ప్రకృతి విపత్తు సంభవించి మూడు రోజులు గడిచినా ఇంకా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- శిథిలాల కిందే వేలాది మంది ఉన్నారంటూ బంధువుల ఆందోళన
- సహాయక చర్యల్లో స్పందించడం లేదంటూ ప్రభుత్వం ఆగ్రహం
- విదేశీ రెస్క్యూ బృందాలతో ముమ్మర సహాయక చర్యలు
- 4.8 తీవ్రతతో మరోసారి ప్రకంపనలు



లాగ్వైరా: వరుసగా సంభవించిన రెండు భారీ భూకంపాలతో వెనిజులా ఇంకా కోలుకోలేకపోతోంది. ప్రకృతి విపత్తు సంభవించి మూడు రోజులు గడిచినా శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు నిరంతరం గాలింపు కొనసాగిస్తున్నాయి. తాజా అధికారిక లెక్కల ప్రకారం మృతుల సంఖ్య 1,430కు చేరగా, మరో 68,900 మంది ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న లా గ్వైరా రాష్ట్రంలో ఎటు చూసినా కూలిన భవనాలు, శిథిలాలు, బంధువుల కోసం వెతుకుతున్న ప్రజల రోదనలు కనిపిస్తున్నాయి. సహాయక చర్యల్లో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించలేదన్న విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. పలుచోట్ల స్థానికులే పారలు, తాళ్లు, భారీ యంత్రాలు, చేతులతో శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారిని కాపాడేందుకు శ్రమిస్తున్నారు. అధికారులు సహాయక చర్యల కంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భూకంపం అనంతరం తరువాయి 2లో..

అఫ్గానిస్థాన్‌లో భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతగా నమోదు

- బలూచిస్థాన్‌లో వరుస భూకంపాలతో ఐదుగురికి గాయాలు
- పాకిస్థాన్‌లోని పలు నగరాల్లో తీవ్ర ప్రకంపనలు
- భారత్‌లోనూ కంపించిన భూమి

ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు దేశమైన పాకిస్థాన్‌లోని పలు నగరాల్లో బలమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించినట్లు ప్రజలు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదు. అమెరికా భూగర్భ పరిశోధనా సంస్థ ప్రకారం.. భూకంప కేంద్రం అఫ్గానిస్థాన్‌లోని బదఖ్షాన్ ప్రావిన్స్‌లో జుర్మ్ జిల్లాకు దక్షిణంగా 43 కి.మీ. దూరంలో ఉంది. పాకిస్థాన్ వాతావరణ శాఖ మాత్రం భూకంప తీవ్రతను 5.9గా నమోదు చేసింది. హిందూకుష్ పర్వత ప్రాంతంలో 178 కిలోమీటర్ల లోతులో భూకంపం తరువాయి 2లో..

భారత్ బంధానికి

కొత్త బలం

మూడు రోజుల పర్యటనలో భాగంగా సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోదీ

- జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు
- మేడ్ ఇన్ ఇండియా యుద్ధ నౌకను కోస్ట్‌గార్డ్‌కు అందజేత
- రక్షణ, సముద్ర భద్రత సహకారానికి మరింత ఊతం
- అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో కీలక ద్వైపాక్షిక చర్చలు
- అభివృద్ధి కోసం అంబులెన్స్‌లు, వాహనాలు, బోట్ల బహూకరణ

విక్టోరియా: హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మూడు రోజుల అధికారిక పర్యటన కోసం సీషెల్స్‌కు చేరుకున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న మోదీకి ఆ దేశ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో పాటు ఉన్నతాధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం సైనిక గౌరవ వందనాన్ని స్వీకరించిన ప్రధాని, భారత్‌లో నిర్మించిన అత్యాధునిక లెస్ప్వార్ ఫాస్ట్ పెట్రోల్ వెసెల్‌ను సీషెల్స్ కోస్ట్‌గార్డ్‌కు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ సీషెల్స్ సముద్ర భద్రతా సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేయడమే ఈ నౌక బదిలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భారత్–సీషెల్స్ రక్షణ, సముద్ర భద్రత భాగస్వామ్యంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సీషెల్స్ భద్రతా అవసరాల కోసం భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వానికి ఇరు దేశాలు కలిసి కృషి చేస్తాయని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో కలిసి మోదీ సీషెల్స్ జాతీయ వృక్షశాస్త్ర ఉద్యానవనాన్ని సందర్శించారు. అక్కడ అరుదైన భారీ తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఇద్దరూ మొక్కలు నాటారు. జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై ఇరు దేశాల తరువాయి 2లో..

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు అసలైన బలం

- ప్రతి బూత్‌లో మెజారిటీ సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి
- ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి!

- ఢిల్లీలో 41.3 డిగ్రీలే నమోదైనా.. 48.4 డిగ్రీల వేడి అనుభూతి
- అధిక తేమతో తీవ్ర అసౌకర్యం
- మంగళ, బుధవారాలకు ఎల్లో అలర్ట్
- ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు: ఐఎండీ

2

వీబీజీ రామ్‌జీపై కీలక నిర్ణయం

జులై 2న మంత్రివర్గంలో చర్చ.. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న రాష్ట్ర ప్రభుత్వం

- కర్ణాటక, కేరళతో ఉమ్మడి న్యాయపోరాటానికి ప్రయత్నాలు
- కేంద్ర చట్టాన్ని ప్రస్తుత రూపంలో అంగీకరించబోమన్న మంత్రి ఉత్తమ్
- రాష్ట్ర ఉపాధి హామీ చట్టమే తీసుకురావాలని పౌర సంఘాల విజ్ఞప్తి

ప్రజానావ, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రామ్‌జీ చట్టంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో ప్రతిపాదించిన ఈ చట్టంపై జూలై 2న జరిగే మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అవసరమైతే ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. వీబీజీ రామ్‌జీ తరువాయి 2లో..

నాలుగు తరాల న్యాయ పోరాటం

- చిన్న సాంకేతిక లోపాలతో హక్కులు కాదనలేం
- 70ఏళ్ల భూ వివాదానికి ముగింపు పలికిన సుప్రీం
- హరిద్వార్ భూమిపై కొనుగోలుదారుల వారసులకు ఊరట

6

శాంతి దిశగా ఇజ్రాయెల్, లెబనాన్

- అమెరికా సమక్షంలో ఒప్పందంపై సంతకాలు
- హిజ్బుల్లా నిరాయుధీకరణ, ఇజ్రాయెల్ సేనల ఉపసంహరణకు కార్యాచరణ
- లెబనాన్‌కు 100 మిలియన్ డాలర్ల మానవతా సాయం

2

ముగ్గురు సీఎంలు ఏం మాట్లాడుకున్నారు?

కృష్ణా, గోదావరి జలాల్లో రాజీపడేదే లేదు

- కర్ణాటక సమావేశంలో జరిగిన చీకటి ఒప్పందంపై సమాధానం చెప్పాలి
- తెలంగాణ జల హక్కులకు భంగం కలిగించేలా రేవంత్ ప్రభుత్వం వ్యవహారం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2



గాజాలో మళ్లీ దాడులు

- కాల్పుల విరమణ ఉన్నా కొనసాగుతున్న ఆగని వైమానిక దాడులు
- నిరాశ్రయుల టెంట్ శిబిరాలపై ఇజ్రాయెల్ డ్రోన్లు
- ఇద్దరు మృతి, 19 మందికిపైగా గాయాలు
- హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా దాడి చేశాం: ఇజ్రాయెల్

గాజా: కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం దక్షిణ గాజాలోని మువాసి ప్రాంతంతో పాటు గాజా నగరంలోని పశ్చిమ ప్రాంతంలో నిరాశ్రయుల టెంట్ శిబిరాలపై ఇజ్రాయెల్ డ్రోన్లు దాడులు జరపడంతో ఇద్దరు పాలస్తీనీయులు మృతిచెందగా, 19 మందికిపైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మహిళలు అధిక సంఖ్యలో ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మువాసి ప్రాంతంలోని శిబిరంపై జరిగిన డ్రోన్ దాడిలో 15 ఏళ్ల బాలిక ఇస్లాం మౌసా, ఆమె 30 ఏళ్ల సోదరుడు అబ్దుల్లా మౌసా మృతిచెందారు. మరో ఏడుగురు గాయపడగా, వారిని నాసర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను ఆస్పత్రికి తీసుకొచ్చిన అనంతరం బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. అదేరోజు గాజా నగరంలోని పశ్చిమ ప్రాంతంలో నిరాశ్రయులు ఆశ్రయం పొందిన మరో టెంట్‌పై ఇజ్రాయెల్ దాడి జరిపింది. ఈ ఘటనలో కనీసం 12 మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు షిఫా ఆస్పత్రి, పాలస్తీనా రెడ్ క్రెసెంట్ సంస్థ వెల్లడించాయి. గాయపడిన వారిలో ఎక్కువ మంది మహిళలేనని పేర్కొన్నాయి. ఈ రెండు దాడులను అంగీకరించిన ఇజ్రాయెల్ సైన్యం, హమాస్‌కు చెందిన మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకునే వైమానిక దాడులు నిర్వహించినట్లు తెలిపింది. సామాన్య పౌరులు గాయపడినట్లు తమ వద్ద సమాచారం లేదని పేర్కొంది.1,030 మందికిపైగా మృతిఇక అక్టోబర్‌లో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత కూడా గాజాలో ఇజ్రాయెల్ దాదాపు ప్రతి రోజూ వైమానిక దాడులు, షెల్లింగ్ కొనసాగిస్తోంది. కాల్పుల విరమణ ఉల్లంఘనకు సంబంధించి ఇజ్రాయెల్, హమాస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత గాజాలో 1,030 మందికిపైగా మరణించారు. వారిలో 250 మందికిపైగా చిన్నారులే ఉన్నారు. అక్టోబర్ 7, 2023న ప్రారంభమైన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 73 వేలకుపైగా పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది.

శాంతి దిశగా ఇజ్రాయెల్–లెబనాన్

- అమెరికా సమక్షంలో ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై సంతకాలు
- హిజ్బుల్లా నిరాయుధీకరణ, ఇజ్రాయెల్ సేనల ఉపసంహరణకు కార్యాచరణ
- లెబనాన్‌కు 100 మిలియన్ డాలర్ల మానవతా సాయం ప్రకటించిన అమెరికా
- శాశ్వత శాంతికి తొలి అడుగు: రుబియో
- అంతర్యుద్ధానికి దారితీస్తుందంటూ హిజ్బుల్లా హెచ్చరిక

వాషింగ్టన్/బీరూట్: నెలల తరబడి కొనసాగిన ఘర్షణల అనంతరం ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య శాంతి ప్రక్రియకు నాంది పలికేలా అమెరికా మధ్యవర్తిత్వంలో కీలక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం కుదిరింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సమక్షంలో ఇరు దేశాల అమెరికా రాయబారులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీనిని శాశ్వత శాంతి దిశగా తొలి అడుగుగా అమెరికా అభివర్ణించింది. ఈ ఒప్పందంలో హిజ్బుల్లా భాగస్వామి కాకపోయినా, దానిని నిరాయుధీకరించి లెబనాన్ సార్వభౌమాధికారాన్ని పూర్తిగా పునరుద్ధరించే ప్రక్రియకు ఇది మార్గం సుగమం చేస్తుందని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఒప్పందం అమలును పర్యవేక్షించేందుకు మిలిటరీ కోఆర్డినేషన్ గ్రూప్ ఫర లెబనాన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. అలాగే లెబనాన్‌కు 100 మిలియన్ డాలర్ల మానవతా సాయాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ రాయబారి యెచియెల్ లీటర్ మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య శాంతియుత సంబంధాలే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. హిజ్బుల్లా పూర్తిగా నిరాయుధీకరణకు అంగీకరిస్తే ఇజ్రాయెల్ సేనలు వెనక్కి వెళ్లేందుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. లెబనాన్ రాయబారి నాదా హమాదె మొవాద్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం దేశ సార్వభౌమాధికారం పునరుద్ధరణకు, సరిహద్దుల్లో శాశ్వత శాంతి నెలకొల్పేందుకు తొలి అడుగుగా నిలుస్తుందని అన్నారు. లెబనాన్ ప్రధాని నవాఫ్ సలామ్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్ సేనలు లెబనాన్ భూభాగం నుంచి పూర్తిగా వైదొలగడం, ప్రభుత్వ అధికారాన్ని దేశమంతటా విస్తరించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యాలని చెప్పారు. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సేనలు దశలవారీగా వెనక్కి వెళ్లే ప్రాంతా ల్లో లెబనాన్ సైన్యం పూర్తి నియంత్రణ చేపట్టే పైలట్ జోన్ల ఏర్పాటుపై కూడా చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ ఒప్పందాన్ని తమ దేశానికి గొప్ప విజయంగా అభివర్ణించారు. హిజ్బుల్లా పూర్తిగా నిరాయుధీకరణ జరిగే వరకు దక్షిణ లెబనాన్‌లోని భద్రతా మండలిలో ఇజ్రాయెల్ తన ఉనికిని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఒప్పందంపై హిజ్బుల్లా తిరుగుబాటు

అమెరికా మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కుదిరిన శాంతి ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని హిజ్బుల్లా తీవ్రంగా వ్యతిరేకించింది. ఇజ్రాయెల్ సేనలు లెబనాన్ నుంచి పూర్తిగా వైదొలగాలంటే ముందుగా హిజ్బుల్లా నిరాయుధీకరణ జరగాలన్న షరతును ఆ సంస్థ తిరస్కరించింది. ఈ ఒప్పందం అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ, హిజ్బుల్లా నేత నయీమ్ ఖాసిం దీనిని అవమానకర ఒప్పందంగా అభివర్ణించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఖాసిం మాట్లాడుతూ, ఇజ్రాయెల్ పూర్తిగా లెబనాన్‌ను వీడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హిజ్బుల్లా మద్దతుదారులు బీరూట్‌లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ఒప్పందం లెబనాన్‌లో అంతర్యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని ఆ సంస్థ నేతలు హెచ్చరించారు. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన ఒప్పంద వివరాల ప్రకారం, హిజ్బుల్లా దేశవ్యాప్తంగా నిరాయుధీకరణకు అంగీకరిస్తేనే ఇజ్రాయెల్ సేనలు దశలవారీగా లెబనాన్ భూభాగం నుంచి వైదొలుగుతాయి. తొలి దశలో రెండు పైలట్ జోన్ల నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనక్కి వెళ్లగా, అక్కడ భద్రతా బాధ్యతలను లెబనాన్ సైన్యం చేపడుతుంది. అనంతరం తదుపరి ప్రాంతాల నుంచి ఉపసంహరణపై నిర్ణయం తీసుకోనున్నారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రత్యేక అనుబంధాన్ని మాత్రం బహిర్గతం చేయలేదు.

మరుసటి రోజే డ్రోన్ దాడి

ఒప్పందం కుదిరిన మరుసటి రోజే దక్షిణ లెబనాన్‌లోని నబతియె సమీపంలో ఇజ్రాయెల్ డ్రోన్ దాడి జరిగినట్లు లెబనాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. అదే సమయంలో అదుపులోకి తీసుకున్న ముగ్గురు లెబనాన్, ముగ్గురు సిరియా కార్మికులను ఇజ్రాయెల్ విడుదల చేసినట్లు వెల్లడించింది. ఒప్పందంపై లెబనాన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు శాంతి పునరుద్ధరణకు ఇది అవసరమని భావిస్తుండగా, మరికొందరు ఇది ఇజ్రాయెల్ ఆక్రమణకు చట్టబద్ధత కల్పిస్తోందని విమర్శిస్తున్నారు. హిజ్బుల్లాకు నిధులు, పునర్నిర్మాణ నిధులు చేరకుండా నిరోధించేందుకు అమెరికా, లెబనాన్ కలిసి చర్యలు తీసుకోవాలని కూడా ఒప్పందంలో పేర్కొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు అసలైన బలం

- ప్రతి బూత్‌లో మెజారిటీ సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి
- ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపు
- కాంగ్రెస్ పాలనపై విమర్శలు.. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రజానావ, రంగారెడ్డి బ్యూరో: పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు వెన్నెముక అని, వారు కథానాయకుల్లా కదం తొక్కితే ప్రతి బూత్‌లో పార్టీకి మెజారిటీ ఖాయమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంతో పాటు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా తీసుకోవాలని, అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అదే విధంగా డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక గుర్తింపు కార్డు అందజేస్తామని, దాంతో వారికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మహేశ్వరంలో కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బీఆర్ఎస్ విజయంపై పూర్తి విశ్వాసం కలుగుతోందని అన్నారు. నియోజకవర్గంలో మరోసారి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో కుంభకోణాలే ఎక్కువ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి మందగించిందని, సంక్షేమ పథకాలు బలహీనపడ్డాయని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో అమలైన పలు సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయని, ప్రస్తుతం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షేమం కంటే కుంభకోణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో మహేశ్వరం ప్రాంతానికి చెందిన అమరవీరుడు సిరిపురం యాదయ్య చేసిన త్యాగాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ స్మరించారు. అమరవీరుల ఆశయాల సాధన కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ పాలన సాగించిందన్నారు. కేసీఆర్‌కు పదవులు కొత్త కాదని, తెలంగాణ కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన నాయకుడిగా ఆయనకు ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

రహదారికి డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ పేరు

- రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన అమెరికా అధ్యక్షుడు
- ఈ గౌరవం పొందిన తొలి వ్యక్తిని నేనేనంటూ ట్రూత్ సోషల్ వేదికగా స్పందన
- భారత్–అమెరికా సంబంధాలకు గుర్తింపుగా: తెలంగాణ ప్రభుత్వం

వాషింగ్టన్/హైదరాబాద్: హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ సమీప రహదారికి తన పేరును పెట్టిన తెలంగాణ ప్రభుత్వానికి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించిన ట్రంప్, ఈ తరహా గౌరవం పొందిన తొలి అమెరికా అధ్యక్షుడు తానే నని, భారత్‌లోని హైదరాబాద్‌లో కొత్త గా ఏర్పాటు చేసిన డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ... ఈ విధంగా గౌరవించబడిన తొలి అమెరికా అధ్యక్షుడి ని. ధన్యవాదాలు అంటూ ట్రంప్ పోస్టు చేశారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమా ర్క, భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కలిసి ఇటీవల ఆ రహదారి పేరును ఆవిష్కరించిన ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. అమెరికా కాన్సులేట్‌కు ఆనుకుని ఉన్న ఈ రహదారి సమీపంలో మైక్రో సాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రముఖ అమెరికన్ టెక్నాలజీ సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. హైదరాబాద్ అమెరికా–భారత్ సంబంధాల్లో పెరుగుతున్న ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ, రెండు దేశాల మధ్య స్నేహబంధానికి ప్రతీకగా ఈ రహదా రికి డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా నామకరణం చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

రహదారుల అభివృద్ధికి శ్రీకారం

- నేడు నల్లగొండ జిల్లా కనగల్‌లో శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్
- మొదటి విడతలో 441 రహదారుల ఆధునీకరణ

ప్రజానావ, నల్లగొండ: తెలంగాణలో రహదారుల మౌలిక వసతులను సమూలంగా మెరుగుపర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ రోడ్ల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రూ.13,006 కోట్లను కేటాయించింది. ఈ మెగా ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా కనగల్‌లో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ప్రాజెక్టు తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రహదారులను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పారిశ్రామిక, వాణిజ్యపరంగా కీలకమైన మార్గాలను అత్యాధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. హ్యామ్ విధానంలో పనులు చేపట్టడం వల్ల నిర్ణీత గడువులోనే నాణ్యమైన నిర్మాణం పూర్తయ్యే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రహదారి ప్రమాదాలను నివారించడం, ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా వెల్లడించారు. కనగల్‌లో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకాను న్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. తెలంగాణ మౌలిక వసతుల అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ముగ్గురు సీఎంలు ఏం మాట్లాడుకున్నారు?

ప్రజానావ, హైదరాబాద్: కర్ణాటకలో ఇటీవల మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సమావేశంలో ఎలాంటి ఒప్పందాలు జరిగాయో తెలంగాణ ప్రజలకు స్పష్టం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సమావేశానికి అధికారులు కూడా లేకుండా ముగ్గురు ముఖ్యమంత్రులు, సంబంధిత మంత్రి మాత్రమే చర్చలు జరపడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తెలంగాణ జలహక్కులకు భంగం కలిగించేలా ఏవైనా నిర్ణయాలు తీసుకున్నారా అనే అంశంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్న సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి దానిని చారిత్రక ఒప్పం దంగా అభివర్ణించడం బాధాకరమని విమర్శించారు. గతంలో గుండ్రేవుల ప్రాజెక్టుకు అనుమతులు రాకుం డా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు నీటి కేటాయింపుల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నీటి పంపిణీ, వాటాల అంశాలపై సరైన అవగాహన లేదని విమర్శించారు. ప్రభుత్వం రాజీ పడినా బీఆర్ఎస్ మాత్రం తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీకి సిద్ధంగా ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో దశాబ్దాల పాటు నీటి వినియోగ అనుమతులు చాలా పరిమితంగా వచ్చినప్పటికీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో అనుమతులు సాధించామని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన 968 టీఎంసీల నీటిలో ఇప్పటికే 830 టీఎంసీలకు అనుమతులు లభించాయని, మిగిలిన వాటి కోసం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

బనకచర్లపై స్పందనే లేదు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని, ఆ అంశాన్ని బీఆర్ఎస్‌నే బలంగా లేవనెత్తిందన్నారు. పాలమూరు ప్రాంతానికి కీలకమైన సమ్మక్క–సారక్క ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురవుతోందని, దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ గేట్ల మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, అయితే ఇతర రాష్ట్రాల ప్రాజెక్టులపై ఆసక్తి చూపుతోందని హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్, పార్టీ అధినేత కేసీఆర్ ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండబోరని హెచ్చరించారు. తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే మరోసారి ఉద్యమానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు.

కోలుకోలేని వెనిజులా

మొదటిపేజీ తరువాయి)

తొలి 48 నుంచి 72 గంటలు అత్యంత కీలకమని విపత్తు నిర్వహణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యం లో మెక్సికో, అమెరికా, బ్రెజిల్, ఎల్‌సాల్వడార్, ఫ్రాన్స్‌తో పాటు పలు దేశాల నుంచి అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు వెనిజులాకు చేరుకుని శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం ప్రత్యేక పరికరాలతో ముమ్మరంగా గాలిస్తున్నాయి. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ మాట్లాడుతూ, ప్రభావిత ప్రాంతాల్లో 14 వేల మందికిపైగా సైనికులు, పోలీసులు, అత్యవ సర సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. ఇప్పటివ రకు 17 ప్ర త్యేక విమానాల ద్వారా 1,600 మందికి పైగా విదేశీ సహాయక సిబ్బంది దేశానికి చేరుకున్నారని వెల్లడించారు. ఇదిలా ఉండగా, భూకంపాల ప్రభావంతో రాజధాని కారకాస్‌కు సేవలందించే సిమోన్ బొలివార్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతింది. ప్రస్తుతం ఒకే రన్‌వే ద్వారా విమాన రాకపోకలు కొనసాగుతుండగా, మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. అత్యవసర వైద్యసేవలు, సహాయక సామగ్రి తరలింపునకు అమెరికా సైన్యం సమన్వయం చేస్తుండగా, తీవ్రంగా గాయపడిన బాధితులను తరలించేందుకు అమెరికా నౌకాదళానికి చెందిన ఓ రవాణా నౌకను తీరంలో సిద్ధంగా ఉంచారు. శనివారం 4.8 తీవ్రతతో మరోసారి ప్రకంపనలు నమోదవడంతో ప్రజల్లో భయం మరింత పెరిగింది. వరుస భూప్రకంపనలు సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నప్పటికీ, శిథిలాల్లో ఇంకా ప్రాణాలతో ఉన్నవారిని రక్షించేందుకు సహాయక బృందాలు సమయంతో పోటీ పడుతున్నాయి.

వీబీజీ రామ్‌జీపై కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

చట్టాన్ని అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైంది. ఉపసంఘానికి అధ్యక్షత వహించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత రూపంలో ఉన్న కేంద్ర చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేసినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. ఈ చట్టంతో రాష్ట్రాల ఆర్థిక, పరిపాలనా అధికారాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున కర్ణాటక, కేరళ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని ఉపసంఘం నిర్ణయిం చింది. అవసరమైతే ఉమ్మడి గా సుప్రీంకోర్టును ఆశ్రయించడం లేదా ఇతర సమన్వయ చర్యలు చేపట్టే అంశాన్ని పరిశీలిం చనుంది. వీబీజీ రామ్‌జీ చట్టానికి సంబంధించి అన్ని అంశాలను జూలై 2న రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నారు. కేంద్రం ప్రతిపాదించిన విధానాన్ని అమలు చేయాలా, రాష్ట్రానికి ప్రత్యేక ఉపాధి హామీ చట్టం రూపొందించాలా, న్యాయపోరాటానికి దిగాలా లేదా పరిపాలనా, న్యాయపరమైన చర్యలను సమాంతరంగా చేపట్టాలా అనే అంశాలపై మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. ఇదిలా ఉండగా, పౌరసంఘాలు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర చట్టాన్ని యథాతథంగా అమలు చేయకుండా, రాజ్యాంగబద్ధం గా రాష్ట్రానికి ప్రత్యేక ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశాయి. కేంద్ర ప్రతిపాదనను అమలు చేస్తే రాష్ట్ర ఖజానాపై దాదాపు రూ.2,500 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని, అందువల్ల రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్వతంత్ర విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరాయి.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి!

- ఢిల్లీలో 41.3 డిగ్రీలే నమోదైనా.. 48.4 డిగ్రీల వేడి అనుభూతి
- అధిక తేమతో తీవ్ర అసౌకర్యం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ఎండ కంటే ఉక్కపోతే ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. గరిష్ఠ ఉష్ణోగ్రత 41.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనా, గాలిలో తేమ శాతం అధికంగా ఉండటంతో ఫీల్స్ లైక్ (హీట్ ఇండెక్స్) ఉష్ణోగ్రత 48.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. దీంతో బయటకు వచ్చిన ప్రజలు భరించలేని వేడి, ఉక్కపోతతో తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 30.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదై సాధారణం కంటే 2.9 డిగ్రీలు ఎక్కువగా ఉంది. గరిష్ఠ ఉష్ణోగ్రత కూడా సాధారణ స్థాయి కంటే 4.1 డిగ్రీలు అధికంగా నమోదైంది. పాలం, లోధీ రోడ్, రిడ్జ్, అయానగర్ ప్రాంతాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రిపూట కూడా వేడి తగ్గలేదు. శనివారం తెల్లవారుజామున నగరంలోని కొన్ని ప్రాంతాల్లో స్వల్ప జల్లులు కురిసినా, పగటిపూట వర్షం లేకపోవడంతో వేడి తగ్గలేదు. పైగా గాలిలో తేమ పెరగడంతో ఉక్కపోత మరింత అధికమై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళ, బుధవారాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆ రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం మధ్యాహ్నం లేదా సాయంత్రం ఉరుములు ఏర్పడే అవకాశముండగా, గంటకు 20–30 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం 40 కిలోమీటర్ల వరకు చేరవచ్చని పేర్కొంది.

వారం మధ్య నాటికి ఉపశమనం

ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 39–41 డిగ్రీల మధ్య కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, వర్షాల ప్రభావంతో బుధవారం నాటికి అది 35–37 డిగ్రీల మధ్యకు పడిపోవచ్చని ఐఎండీ అంచనా వేసింది. దీంతో తీవ్ర ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

సీషెల్స్‌తో భారత్ బంధానికి కొత్త బలం

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి నిబద్ధతకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలిచిందని సీషెల్స్ ప్రభుత్వం పేర్కొంది.

అభివృద్ధికి భారత్ నుంచి చేయూత

ఫాస్ట్ పెట్రోల్ వెసెల్‌తో పాటు ఆరు అంబులెన్స్‌లు, పది యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను కూడా ప్రధాని మోదీ సీషెల్స్‌కు అందజేశారు. ఆరోగ్య సేవలు, విపత్తుల నిర్వహణ, ప్రజా భద్రత, సముద్ర పర్యవేక్షణ రంగాల్లో ఇవి సీషెల్స్‌కు మరింత ఉపయోగపడనున్నాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. రక్షణ, సముద్ర భద్రత, ఆరోగ్యం, విద్య, సామర్థ్యాభివృద్ధి, వాతావరణ మార్పులు, బ్లూ ఎకానమీ, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించనున్నారు.

ప్రవాస భారతీయులతో ఆత్మీయ ముచ్చట

విమానాశ్రయం వెలుపల పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భారతీయ ప్రవాసులను ప్రధాని మోదీ ఆప్యాయంగా పలకరించారు. సీషెల్స్ అభివృద్ధిలో భారతీయ సమాజం చేస్తున్న విశేష సేవలను ప్రశంసిస్తూ, ఇరు దేశాల మధ్య ప్రజల అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తున్న వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని కొనియాడారు. మరోవైపు ప్రధాన మంత్రి హోదాలో మోదీ 2015 తర్వాత రెండోసారి సీషెల్స్‌ను సందర్శిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు భారతీయ ప్రవాసులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. విజన్ మహాసాగర్ కార్యాచరణలో సీషెల్స్ కీలక సముద్ర భాగస్వామి అని పునరుద్ఘాటించిన ప్రధాని, హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిర అభివృద్ధి కోసం ఇరు దేశాలు కలిసి ముందుకు సాగుతాయని పేర్కొన్నారు.

అఫ్గానిస్థాన్‌లో భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

సంభవించినట్లు వెల్లడించింది. ఇస్లామాబాద్, రావల్పిండి, పెషావర్, స్వాత్, అబొట్టాబాద్, టాక్సిలా, హరిపూర్, బునేర్ తదితర నగరాల్లో ప్రకంపనలు స్పష్టంగా నమోదయ్యాయి. లాహోర్‌లోనూ భూమి కంపించింది. అప్రమత్తమైన అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో భవనాలను పరిశీలిస్తున్నారు. అత్యవసర నియంత్రణ కేంద్రాలను అప్రమత్తంగా ఉంచినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో శుక్రవారం నుంచి వరుసగా ఐదు మోస్తరు తీవ్రత భూకంపాలు సంభవించాయి. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.2 నుంచి 4.3 మధ్య నమోదైంది. ఈ ఘటనల్లో ఐదుగురు గాయపడగా, ముసాఖైల్, కింగ్రి, బర్ఖాన్ తదితర ప్రాంతాల్లో మట్టి ఇళ్లు కూలిపోయాయి. సహాయక బృందాలు సహాయ చర్యలు కొనసాగిస్తున్నాయి. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులు వేగం

- భక్తులకు మెరుగైన దర్శనం.. వసతులు కల్పించేలా ముందుకు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ లో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ,పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ , జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనుల వద్ద ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని వివరించారు. ఇప్పటి వరకు 35 శాతం పూర్తి అయ్యాయని తెలిపారు. శృంగేరి పీఠాధిపతి సూచనలు, ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. ఆలయ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.. పోచమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.. నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని అందులో భాగంగా ఇప్పటికే నాంపల్లి ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. రానున్న రోజుల్లో నాంపల్లి గుట్టను పర్యాటక రంగంలో తీర్చి దిద్దుతామని తెలిపారు..ఆద్యాత్మిక వాతావరణంలో సకల సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, భక్తుల మనోభావాలు, ఆగమ శాస్త్ర అనుగుణంగా రాజన్న ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు.. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- మైనార్టీలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలి
- ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

ప్రజానావ, ఆదిలాబాద్: ఓట్ల విషయంలో పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఒక్క ఓటు కూడా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏ–2లకు నిర్వహించిన అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ప్రతిపక్ష ఓట్ల తొలగింపు జరిగే అవకాశం ఉందని, దీని వల్ల ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బలంగా ఉన్న మైనార్టీలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బీఎల్ఏలు, పార్టీ మండలాధ్యక్షులు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలన్నా, దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నా ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి అవసరమని వ్యాఖ్యానించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎన్యూమరేషన్ నిర్వహిస్తున్న బీఎల్వోలతో కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు సత్సంబంధాలు కొనసాగించాలని, వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ రోజువారీ వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జిలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రతిరోజూ అప్‌డేట్లు పంపాలని చెప్పారు. తొలగించిన ఓట్ల వివరాలు ఎందుకు తొలగించారనే విషయంపై పూర్తిస్థాయిలో ఆరా తీయాలని సూచించిన మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 23 లక్షలకుపైగా ఓటర్లు ఉండగా ఇప్పటివరకు కేవలం 18 లక్షల ఓట్లు మాత్రమే మ్యాపింగ్ అయ్యాయని తెలిపారు. ఇంకా ఐదు లక్షలకు పైగా ఓట్లు మ్యాపింగ్ కాలేదని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోనే 44.04 శాతం ఓట్లు ఇంకా మ్యాపింగ్ కాలేదని పేర్కొన్న ఆయన, స్థానికంగా లేని వారి ఓట్లు తొలగింపునకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని రప్పించి మ్యాపింగ్ చేయించాలని సూచించారు. ప్రతి ఓటు అత్యంత ముఖ్యమని, ఒక్కసారి ఓటు తొలగించబడితే తిరిగి పొందడం కష్టమని పేర్కొన్నారు. బీఎల్వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లాలని, ఈ నెలరోజుల పాటు విరామం లేకుండా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. బీహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో పెద్దఎత్తున ఓట్లు తొలగించబడిన పరిస్థితులను గుర్తుచేస్తూ అలాంటి పరిస్థితులు తెలంగాణలో రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ శ్రేణులు పదవుల విషయంలో నిరాశ చెందవద్దని, త్వరలో సొసైటీ చైర్మన్ బాధ్యతలను భర్తీ చేస్తామని తెలిపారు. స్థానిక నాయకులు కోరిన మేరకు ముఖ్యమంత్రితో సమావేశానికి అపాయింట్‌మెంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించిన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన గత ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. రూ.8 వేల కోట్ల అప్పు భారాన్ని తమ ప్రభుత్వంపై మోపారని, ఆ అప్పులపై వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయకపోతే ఓట్ల తొలగింపు పెద్దఎత్తున జరిగే ప్రమాదం ఉందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోనే సుమారు 40 వేల ఓట్లు మ్యాపింగ్ కాలేదని తెలిపారు. ఓట్ల తొలగింపు భవిష్యత్తుకు ప్రమాదకర హెచ్చరికగా మారే అవకాశం ఉందని, దీని వల్ల ప్రభుత్వ భవిష్యత్తుపైనా ప్రభావం పడవచ్చని అన్నారు. సెక్యులర్ పార్టీల ఓట్ల తొలగింపుపై బీజేపీ దృష్టి పెట్టిందని ఆరోపిస్తూ అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మాజీ ఎంపీ సోయం బాపూరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ పాఠశాలకు ప్రీ ప్రైమరీ మంజూరు చేయాలి

- వారం రోజుల్లో నిర్ణయం లేకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం
- సర్పంచ్ పోచంపల్లి రాజు

ప్రజానావ, గజ్వేల్: జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ప్రీ ప్రైమరీ అనుమతులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ పోచంపల్లి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి శనివారం జగదేవపూర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎంఈవో కార్యాలయానికి వెళ్లగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోచంపల్లి రాజు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ గ్రామంలో సుమారు 1,500 మంది జనాభా ఉండగా, గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో గత ఏడాది ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో యూడీఐఎస్ఈ పోర్టల్‌లో నమోదు చేసి యూకేజీ తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. గత ఏడాది 8 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది ఇప్పటికే 13 మంది విద్యార్థులు చేరారని, మరో 15 మంది చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో దాదాపు 25 మంది విద్యార్థులు యూకేజీలో చేరే అవకాశం ఉందని వెల్లడించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, విద్యా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ప్రచారం ఫలితంగా హైస్కూల్‌లో 35 మంది, ప్రైమరీ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను విడిచి ప్రభుత్వ పాఠశాలలో చేరారని తెలిపారు. గతంలో జరిగిన సమావేశంలో తిమ్మాపూర్ పాఠశాలకు ప్రీ ప్రైమరీ అనుమతి తప్పకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ఎంఈవో ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసి సమస్యను వివరించగా, గత ఏడాది అనుమతి పొందిన పాఠశాలలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ నిర్ణయం స్థానిక డీఈఓ, ఎంఈవోల పరిధిలో ఉంటుందని స్పష్టం చేశారని తెలిపారు. అయితే స్థానిక అధికారులకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై కనీస అవగాహన లేదని, ఇప్పటికే కలెక్టర్, డీఈఓ, ఎంఈవోలకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా తిమ్మాపూర్ పాఠశాలకు ప్రీ ప్రైమరీ మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు ఇవ్వకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ విద్యా కమిటీ చైర్మన్ కొంతం కృష్ణంరాజు, విద్యా కమిటీ సభ్యులు కిష్టయ్య, వడ్లకొండ మహేష్, వార్డు సభ్యుడు నవనీత్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులపై సమగ్ర సర్వే

- భూగర్భ జలాల పునరుద్ధరణకు రీఛార్జ్
- గుంతల ఏర్పాటుపై ప్రత్యేక కమిటీ

ప్రజానావ, కామారెడ్డి: సింగూర్ రిజర్వాయర్ నీటి లభ్యతను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు భూగర్భ జలాలను పరిరక్షించేందుకు సింగూర్ సెగ్మెంట్ పరిధిలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని 14 మండలాల గ్రామాల్లో తాగునీటి వనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్‌తో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకేలా శాశ్వత పరిష్కారాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

డాకూర్‌లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్

ప్రజానావ, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూర్ గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించి, అధిక విస్తీర్ణంలో మొక్కల నాటకాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డాకూర్ గ్రామానికి చెందిన రైతు డాకూరి వెంకటేష్ పొలంలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. 2026–27 సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా, ఆ లక్ష్య సాధన దిశగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపుతూ మొక్కల నాటకం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆయిల్ పామ్ పంట కొనుగోలు చేసే సౌకర్యం ఉన్నందున రైతులు ఈ పంట సాగు వైపు మరింతగా ముందుకు రావాలని కోరారు. దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంటగా ఆయిల్ పామ్ నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, ఉద్యాన అధికారి టి. సమత, హెచ్ఈఓ సంగయ్య స్వామి, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఏరియా మేనేజర్ ఈశ్వర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు శివరామ్, హర్ష, అందోల్ మండలానికి చెందిన రైతులు కిరణ్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు బంగారం అంటూ బురిడీ

- పారిపోతుండగా సూర్యాభాయ్ అరెస్ట్

ప్రజానావ, హైదరాబాద్ : గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధర బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై సు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తక్కువ ధర విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకుల నుంచి సూర్య భాయ్ లక్షలాది రూపాయలను వసూలు చేసి భారీ మోసానికి తెరతీశాడు. గోల్డ్ మ్యాన్ మాటలు నమ్మి హిమాయత్‌నగర్, నీలోఫర్‌కు చెందిన బాధితులు దాదాపు రూ.30 లక్షలు ఇచ్చారు. అయితే బంగారం ఇవ్వకపోవడంతో సూర్య ఇంటికి వెళ్లిన బాధితులు.. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వాటి విలువ రూ.10 లక్షలు అని, అలాగే రూ.20 లక్షల చెక్ ఇచ్చి బాధితులను పంపించేశాడు. అనంతరం బాధతులపైనే సూర్య భాయ్ తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనను బెదిరించి ఫోన్ లాక్కెల్లారంటూ సూర్య భాయ్ పోలీసులను తెలిపారు. ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజామన్ని బయటపెట్టారు. తక్కువ ధర బంగారం పేరుతో సూర్య భాయ్ మోసం చేశారంటూ అత్తాపూర్ పోలీసులు సు నమోదు చేశారు. అనంతరం ఈ సును నారాయణగూడకు బదిలీ చేశారు. అయితే అరెస్ట్ భయంతో సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్‌లో పోలీసులు పట్టుకున్నారు.

మహిళల రాజకీయ సాధికారతకు రిజర్వేషన్లే మార్గం

- కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడదాం
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజానావ, హైదరాబాద్: మహిళా రిజర్వే షన్ బిల్లును ఇకపై జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌సీఆర్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో నిర్వహించి న 'చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన సభ'లో ఆమె మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల అమలుకోసం దేశవ్యాప్తంగా మహిళలం తా ఏకమై ఉద్యమించాలని, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ సభ నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు ఓబీసీ మహిళలకు ప్రత్యేక ఉపకోటా కూడా కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలంటే రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు తప్పనిసరని పేర్కొన్నారు. మహిళా బిల్లు అమలు చేయకపోతే ఓట్లు వేయబోమని రాజకీయ పార్టీలకు మహిళలంతా స్పష్టంగా చెప్పాలని పిలుపునిచ్చారు. మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక నాయకత్వ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా బీసీ, మైనారిటీ మహిళల నుంచి మరింత నాయకత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. తాను స్థాపించిన పార్టీలో మహిళలకు కనీసం 33 శాతం సీట్లు కేటాయిస్తామని, అర్హత ఉన్నచోట మరింత ప్రాధాన్యం కల్పిస్తామని కవిత తెలిపారు. మహిళలకు న్యాయమైన రాజకీయ అవకాశాలు కల్పించాలంటే అన్ని పార్టీలు కలిసి రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ల అమలుకు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. అనంతరం ఇటీవల మరణించిన తెలంగాణ ఉద్యమకారుడు గొట్టిముక్కల పద్మారావు కుటుంబ సభ్యులను కూకట్‌పల్లిలోని వారి నివాసంలో కవిత పరామర్శించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

- వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటి గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫిషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందు ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. మాట వూద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం

- మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

ప్రజానావ, నిజామాబాద్ : జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేక పిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
☎ 9948433277, 9014966169

EDITORIAL

ప్రజల్లో ప్రశ్నించేతత్వం చచ్చిపోయిందా?

> మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు.

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్ని మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయకృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు డా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు డా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ సులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్‌లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని డా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం, హత్య చేసిన సెక్షన్ల కింద సులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, సులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ సుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో టమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

> చట్టవిరుద్ధంగా నిర్బంధిం చడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది.డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది.

అక్క మహాదేవి గుహలను సందర్శించిన జిల్లా కలెక్టర్

- కృష్ణా నదిలో సోమశిల నుంచి శ్రీశైలంకు బోటులో ప్రయాణం

ప్రజానావ, నాగర్ కర్నూల్ : ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు సమీక్షలు పర్యటనలతో ప్రతిరోజు బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నల్లమల అటవీ ప్రాంతంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న అక్క మహాదేవి గుహలను సందర్శించారు. ఈ సందర్భంగా వారి వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి అటవీ శాఖ అధికారులు పాల్గొని అక్కమహాదేవి గుహల ప్రాముఖ్యత చరిత్రను వివరించారు. నల్లమల టీ ప్రాంతంలోని కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న గుహలను సందర్శించిన అనంతరం ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సోమశిల నుండి పర్యాటక శాఖ బోటులో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణా నదిలో 6 గంటలపాటు ప్రయాణం కొనసాగించి శ్రీశైలం కు చేరుకున్నారు. దారి పొడవున ఉన్న నల్లమల అటవీ అందాలను ప్రకృతిని తిలకించి ఆనందాన్ని వ్యక్తం చేశారు పర్యాటక రంగం అభివృద్ధికి ఈ ప్రాంతం ఎంతో అనుకూలంగా ఉందని సోమశిల శ్రీశైలం పర్యాటకులకు ఒక మంచి అనుభూతిని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు దారి పొడవున కృష్ణా నదిలో మత్స్యకారులు చేపలు పట్టే విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించి వారి అనుభవాలను తెలుసుకున్నారు.

మరో పోరాటానికి సిద్ధం కండి

- బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయం : ఎమ్మెల్సీ తాత మధు

ప్రజానావ, భద్రాచలం : తెలంగాణ సాధన కోసం గతంలో ప్రణాళికాబద్ధంగా ఎలా పోరాటాలు నిర్వహించామో, అదే స్ఫూర్తితో ప్రస్తుతం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం భద్రాచలం లోని కేకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయ మాటలు, అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో సగం కాలం పూర్తికాకముందే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వానికి మాత్రమే జవాబుదారిగా వ్యవహరిస్తున్నారని, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, సీఎం కేసీఆర్ నాయకత్వంపై మళ్లీ ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ గులాబీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భద్రాచలంలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుంది : ఎమ్మెల్సీ తాత మధు

ఎమ్మెల్సీ తాత మధు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు బలమైన స్థానం ఉందని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే నాయకులకు రాజకీయాల్లో స్థానం ఉండదన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. పార్టీ పునర్నిర్మాణ ప్రక్రియ కొనసాగుతోందని, ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. త్వరలోనే వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని సూచించారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, నాయకులు మానే రామకృష్ణ, గొడవర్తి నరసింహా మూర్తి, బోదెబోయిన బుచ్చయ్య, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, గంప రాంబాబు, పెనుమల్లు రామకృష్ణారెడ్డి, దొడ్డి తాతారావు, కనితి రాముడు, రావులపల్లి పృథ్వి, ఆకోజు సునీల్ కుమార్, కోటగిరి ప్రమోద్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, అయినవోలు పవన్ కుమార్, కావూరి గోపి, తెల్లం లక్ష్మి నారాయణతో పాటు నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం

- 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి లక్ష్యం
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలి
- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్
- మొదటి దశలో రూ.200 కోట్లతో పనులు ప్రారంభం

ప్రజానావ, భద్రాచలం : దక్షిణ అయోధ్యగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులకు శనివారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం 7.30 గంటలకు ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, దేశంలోనే ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని ఆధునిక సదుపాయాలతో టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.540 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. మొదటి విడతగా రూ.350 కోట్లు విడుదల కాగా, ప్రస్తుతం రూ.200 కోట్లతో పనులు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయానికి రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలతో పనులు చేపడుతున్నామని చెప్పారు. 2027 జూన్‌లో ప్రారంభమయ్యే గోదావరి పుష్క రాల నాటికి పునరుద్ధరణ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవంగా నిలిచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. పునరుద్ధరణ పనులు పూర్తిగా ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా, సంప్రదాయబద్ధంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పవిత్రతకు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి నిర్మాణ ప్రక్రియను వేద పండితులు, ఆగమ శాస్త్ర నిపుణుల సూచనల మేరకు చేపట్టాలని పేర్కొన్నారు. పనుల కారణంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి దర్శనం, నిత్య పూజలు, అర్చనలు, ఇతర సేవలు నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల రాకపోకలు, క్యూ లైన్లు, తాగునీరు, పరిశుభ్రత, భద్రత తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పునరుద్ధరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదరరావు, ఇరిగేషన్ ఈఈ జానీ, భద్రాచలం డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూణేం కృష్ణ, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, వేద పండితులు, దేవస్థానం అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

- నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రజానావ, సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రూ.5.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సంగారెడ్డిలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రూ.4 కోట్ల వ్యయంతో హాస్టల్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే రూ.75 లక్షలతో గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఆడిటోరియం నిర్మించనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం కోసం రూ.15 లక్షలు కేటాయించారు. తారా డిగ్రీ కళాశాలలో ప్రహరీ నిర్మాణం కోసం రూ.50 లక్షలు వెచ్చించనున్నారు. ఈ నిర్మాణ పనులకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, బ్లాక్ అధ్యక్షుడు జార్జ్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు సంగీత మహేష్, సుష్మిత, రవి నాయక్, శ్రీకాంత్ గౌడ్, ప్రీతి, కో–ఆప్షన్ సభ్యులు బబ్బు, శివుడు, యశోద, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్

ప్రజానావ, ఆలేరు: ఆలేరు పట్టణంలోని శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దుర్గమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక
- ప్రతిష్టాత్మక పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజానావ, మెదక్: నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా సమీక్షించిన కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. జిల్లాకు మంజూరైన మొత్తం 8,953 ఇళ్లలో ఇప్పటివరకు 7,271 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తి కాగా, ఇది 81 శాతంగా నమోదైందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి రోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. వారంవారీగా నిర్మాణాల దశల వారీ పురోగతిని సమీక్షించి ఇళ్లను త్వరగా తుది దశకు తీసుకురావాలని ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ వంటి నిర్మాణ సామగ్రి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికీ ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి జూలై 15లోపు పూర్తి చేయాలని, ప్రతిరోజూ ఎన్ని ఇళ్లు పూర్తవుతున్నాయన్న అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులైతే, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేసి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రస్తుతం గుడిసెల్లో నివసించే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గ్రామాలు, పట్టణాల జనాభా ప్రాతిపదికన ఇళ్ల కేటాయింపు చేపట్టి లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ఆయా మండలాల్లో గుడిసెల్లో నివసించే వారిని ప్రత్యేక అధికారులు త్వరితగతిన గుర్తించి నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాస రావు, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల పరిష్కారంపై సమీక్ష

నష్టపరిహారం, బాధితుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పోక్సో కేసుల పరిష్కారం, బాధితులకు అందించే నష్టపరిహారం, వారి సంరక్షణ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణతో పాటు పోక్సో చట్టం అమలు అంశాలపై జిల్లా కోర్టు ఆవరణలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు ఎ. జయరాజు సూచనల మేరకు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి మిలింద్ కాంబ్లి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవిలత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసి, పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. అదేవిధంగా బాధితులకు అందించే నష్టపరిహారం, వారి సంరక్షణ, పునరావాస చర్యలు, బాలల సంరక్షణ కేంద్రాల సమర్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ అధ్యక్షురాలు బి. జయశ్రీ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవి, భువనగిరి సీఐ రమేష్, సఖి కేంద్రం అడ్మిన్ విన్నీ, డీసీపీయూ సిబ్బంది దశరథం తదితరులు పాల్గొన్నారు.

2న కల్వకుర్తిలో భారీ బహిరంగ సభ

- ప్రజలను అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎంపీ మల్లు రవి పిలుపు

ప్రజానావ, కల్వకుర్తి: ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర ముగింపు సందర్భంగా జూలై 2న కల్వకుర్తి పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. శనివారం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అల్లంపూర్ నియోజకవర్గంలోని జోగులాంబలో ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర జూలై 2న కల్వకుర్తి నియోజకవర్గంలో ముగియనున్నట్లు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి రెండున్నర సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి కలిసి ప్రత్యేక కరపత్రాన్ని విడుదల చేశారు. జూలై 2న నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రులపై నిఘా పెట్టాలి

ప్రజానావ, పెద్దపల్లి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో తన ఛాంబర్లో నేడు పిసిపీఎన్డిటి డిస్టిక్ లెవెల్ అడ్వైజరి మీటింగు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయు ప్రైవేటు హాస్పిటల్ లపై నిగా పెట్టాలని ఎవరైనా అతిక్రమించినట్లయితే వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని తెలిపారు. అంతకుముందు ప్రోగ్రాం అధికారిని డాక్టర్ లక్ష్మి భవాని మాట్లాడుతూ సమావేశంకు వచ్చిన అతిథులను ఆహ్వానించి పిసిపీ యాక్ట్ మరియు సర్వీసెస్ గురించి వివరిస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా ఉండడానికి ప్రతినెల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మేము కలిసి ఫారం ఎఫ్ ఆడిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. కె రాజగోపాల్ ఐఆర్సిఎస్ కె రాజగోపాల్ మాట్లాడుతూ లింగ నిష్పత్తి వ్యత్యాసం అన్న ప్రాంతాలలో అధికంగా మానిటరింగ్ చేసి ఎవరైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి పైన చట్టరీత్య చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, ప్రైవేట్ హాస్పిటల్స్ సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. అలాగే సంబంధిత డిపార్ట్మెంట్లు అన్నీ కూడా సమన్వయంతో పనిచేసి ప్రజలలో చైతన్య కల్పించి ఆడ మగ అనే బేదం లేకుండా అవగాహన చేయాలని కోరారు. అలాగే డెకాయ్ ఆపరేషన్ ద్వారా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయు హాస్పిటల్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. డిపిఆర్ఓ జగన్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కార్యక్రమాలపై పత్రికాముఖంగా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్, పీడియాట్రిషన్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ కిరణ్ కుమార్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎన్జీవో సంస్థల ప్రెసిడెంట్లు స్వప్న, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

4న రాష్ట్ర స్థాయి ఎమ్మెస్సీ జువాలజీ ఎంట్రన్స్ గ్రాండ్ టెస్ట్

ప్రజానావ, పెద్దపల్లి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఎమ్మెస్సీ జువాలజీ ఎంట్రన్స్ గ్రాండ్ టెస్ట్, వచ్చే నెల 4న ఆన్ లైన్ విధానం లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.లక్ష్మి నర్సయ్య తెలియ జేశారు. ప్రతీ సంవత్సరం కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ఆన్ లైన్ విధానం లో ఎమ్మెస్సీ జువాలజీ ఎంట్రన్స్ కోచింగ్ మరియు రాష్ట్ర స్థాయి గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా అలాగే నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలియజేశారు. గత సంవత్సరం నిర్వహించిన కోచింగ్ లో ఒక విద్యార్థి రాష్ట్ర స్థాయిలో జువాలాజీ ఎంట్రన్స్ ఎగ్జామ్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చినట్లు తెలియజేశారు. కాబట్టి ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరని తెలిపారు. ఈ సందర్భంగా ఈ పరీక్ష ను నిర్వహిస్తున్న కళాశాల జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీ.హెచ్. తిరుపతి ని , ప్రిన్సిపాల్ తో పాటు ,వైస్ ప్రిన్సిపాల డాక్టర్ ఏ.సతీష్ కుమార్ అధ్యాపక బృందం అభిందినందించారు.

నేటి పల్స్ పోలియోను విజయవంతం చేయండి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జి. ఎంజేలాఅల్ఫ్రేడ్
- 358 పోలియో బూత్‌లు, 41,147మంది చిన్నారులకు పోలియో చుక్కల లక్ష్యం

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. జిల్లాలో 0–5 సంవత్సరాల వయస్సు గల 36,214 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందు కోసం జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ద్వారా మొత్తం 358 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 7 గంటల నుండి కార్యక్రమం మొదలవుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అలాగే సిరిసిల్ల బస్ స్టాండ్‌లో ప్రత్యేక పోలియో బూత్ ఏర్పాటు చేసి ప్రయాణికుల చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ పరిసరాల్లోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించాలని డీఎంహెచ్ఓ కోరారు. పోలియో నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు సమిష్టిగా పనిచేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు.

ఓటు హక్కును నిర్ధారించుకోవాల్సిన బాధ్యత ఓటర్‌దే

- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి

ప్రజానావ, సిరిసిల్ల : ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లందరూ తమ పూర్తి వివరాలతో ప్రభుత్వం నియమించిన బిఎల్ఓ లకు సహకరించి తమ ఓటు హక్కును నిర్ధారించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్క ఓటరు కు ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక 3 వ వార్డులో ప్రజలకు ఎస్ఐఆర్ పట్ల అవగాహన కల్పిస్తూ దాని ప్రాము ఖ్యతను వివరిస్తూ ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాల ను మున్సిపల్ చైర్ పర్సన్ అందజేశారు. ఈ సందర్భంగా జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ జాబితాను సరి చేయడం జరుగుతుందని మరణించిన, ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా తరలి వెళ్ళిన అలాగే ఇతర నకిలీ ఓట్లను తొలగించడం తో ఖచ్చితమైన ఓటర్ జాబితాను తయారు చేయడమే ఎస్ఐఆర్ ఉద్దేశం అని అన్నారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లో అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కూడ కోల్పోకుండ చూడాలని పూర్తి స్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

భద్రతా చర్యలతో విద్యుత్ ప్రమాదాలు దరిచేరవు

- విద్యుత్ ప్రమాదాల నివారణతో జీరో యాక్సిడెంట్ లక్ష్యం సాధించాలి
- సిరిసిల్ల సర్కిల్ ఎస్ఈ టీ. వేణుమాధవ్
- టీజీఎన్‌పీడీసీఎల్‌లో వన్ మినిట్ రూల్ భద్రతా అవగాహన కార్యక్రమం

ప్రజానావ, సిరిసిల్ల : ప్రతి ఉద్యోగి ఏ విద్యుత్ పనిని ప్రారంభించే ముందు ఒక్క నిమిషం సమయం తీసుకుని భద్రతా చర్యలను పరిశీలించడం ద్వారా ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని ఎస్ఈ టి. వేణుమాధవ్ తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారిస్తూ జీరో యాక్సిడెంట్ లక్ష్యాన్ని సాధించేందుకు శనివారం టీజీఎన్‌పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల సర్కిల్ ఆధ్వర్యంలో వన్ మినిట్ రూల్ భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్ ముఖ్య అతిథిగా హాజరై వన్ మినిట్ రూల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ టి. వేణుమాధవ్ మాట్లాడుతూ పని అనుమతి, విద్యుత్ సరఫరా నిలిపివేత, ఎర్తింగ్, వ్యక్తిగత రక్షణ పరికరాలు (పిపిఈ), పనికి ఉపయోగించే పరికరాల స్థితి, పని ప్రదేశంలో ఉన్న ప్రమాదాలపై పూర్తి అవగాహనతోనే పని ప్రారంభించాలని సూచించారు. అలాగే, భద్రత అన్నది కేవలం నిబంధన కాదని, ప్రతి ఉద్యోగి యొక్క బాధ్యత అని పేర్కొంటూ, ఒక్క నిమిషం ఆలోచన... జీవితాంతం రక్షణ అనే సందేశాన్ని ప్రతి ఉద్యోగి ఆచరణలో పెట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ప్రతి పనికి ముందు వన్ మినిట్ రూల్‌ను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితమైన పని సంస్కృతిని మరింత బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ అంజయ్య, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజలింగు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- కార్మికుల ఉపాధి కల్పనకు చర్యలు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల వస్త్ర సేకరణ, నేతన్న పొదుపు పథకం ప్రారంభ కార్యక్రమం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం టెస్కో మరియు చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ , పర్యావరణ, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పలు ప్రతిష్టాత్మక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంపొందించాలని, నాణ్యమైన చీరలు అందించాలని సదుద్దేశంతో.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు రూ. 300 కోట్ల బాకాయిలు చెల్లించామని గుర్తు చేశారు. గత ఏడాది కోటి చీరలు ఉత్పత్తి చేయించామని, ఈ ఏడాది మొదటి విడత కింద మూడు కోట్లకుపైగా మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ ఇచ్చామని, ఇందులో 91 లక్షల మీటర్ల చీరలు ఇప్పటి వరకు ఉత్పత్తి చేశారని వెల్లడించారు. గత ఏడాది కోటి చీరలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. 4000 మంది మరమగ్గాల కార్మికులు, 1500 మంది అనుబంధ రంగాల కార్మికులకు ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. సిరిసిల్ల వస్త్రకపరిశ్రమ బాధ్యులు కార్మికులు ఉపాధి భవిష్యత్తు పై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని, క్రెడిట్ పై వస్త్ర పరిశ్రమకు అందిస్తున్నామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్, తదితర వసతులపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని వెల్లడించారు. సిరిసిల్లలో అధునాతన యంత్రాలు తీసుకురావాలని సూచించారు.

సిరిసిల్లలో నాణ్యమైన చీరలు ఉత్పత్తి

కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించాలని ఉద్దేశంతో ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దేవాదాయ శాఖ, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. త్వరలో రెండో చీర ఆకు పచ్చ రంగు చీరలు ఇవ్వనున్నామని వివరించారు. సిరిసిల్ల చీరకు మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. త్వరలో మరిన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నా రు. ధర్మవరం, కంచి నమూనా లో ఇక్కడ కూడా వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తులు తయారు అవుతున్నాయని వివరించారు. ఉపాధి అవకాశాలు మరిన్ని పెరుగు తున్నాయని పేర్కొన్నారు. సిరిసిల్ల టెక్స్టైల్ ఇండస్ట్రీలో 2.0 మొదలు అయిందని తెలిపారు. నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) కార్మికుల కోరిక మేరకు రెండేళ్ల కాల పరిమితితో ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. దీనిలో కార్మికులను వేతనాల నుంచి 8 శాతం ప్రభుత్వం నుంచి 8 శాతం జమ చేస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా మరమగ్గాల, అనుబంధ రంగాలకు చెందిన 5,534 మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఈ స్కీమ్ ద్వారా వచ్చే డబ్బులు వారి కుటుంబాలకు ఉపయోగ పడుతాయని తెలిపారు. గత ఏడాది 12 కోట్ల రూపాయలను కార్మికులకు పంపిణీ చేశామని గుర్తు చేశారు.

కార్మికులకు ఉపాధి

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సిరిసిల్లలో గత ఏడాది ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి దొరికిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. చీరల ఉత్పత్తి ప్రక్రియను గత ఏడాది మహిళా సంఘాల బాధ్యులతో కలిసి తాను పరిశీలించానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, చేనేత జౌళి శాఖ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజానావ, పెద్దపల్లి: ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూలై 3లోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందించాలని చెప్పారు. ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో స్వీకరించి, మరో ఫారంపై ధృవీకరణ చేసి రసీదుగా తిరిగి ఇవ్వాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్య కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శనివారం పెద్దపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన విద్యలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులు స్వతంత్రంగా చదవడం, మాట్లాడడం, నేర్చుకున్న అంశాలను సృజనాత్మకంగా వ్యక్తపరిచేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి పాఠశాలలో వార్షిక విద్యా ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పాఠ్య ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, డిజిటల్ వనరులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి ఆధునిక సాంకేతికతను తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఆ వివరాలను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అకాడమిక్ ప్యానల్ తనిఖీ బృంద సభ్యులను కలెక్టర్ పరిచయం చేయగా, హాజరైన ఉపాధ్యాయులకు అకాడమిక్ ప్లానింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుంచి సుమారు వెయ్యి మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

పకడ్బందీగా భవిష్యత్తు ప్రణాళికలు రూపకల్పన

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష

ప్రజానావ, సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో పాలన ప్రజలకు మరింత చేరువ అయిందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10 అంశాలతో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహిం చిన సమీక్ష సమావేశానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి శైలజా రామయ్యర్ హాజరు కాగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అంద జేసి.. స్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వం అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరవేయడం, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడమే లక్ష్యంగా మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు జిల్లాలో చేసిన అభివృధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, వివిధ ఫైళ్ల పరిష్కారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంపై జిల్లా యంత్రాంగం రూపొందించి న పీపీటీ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను డాక్యు మెంటరీ రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవం తంగా అమలు చేయడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో పురోగతి, డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం, రోడ్డు భద్రతలో భాగంగా సీపీఆర్ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ, ఇతర పనుల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్ఓ జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా పశువైద్య అధి కారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి
హనుమకొండ, వరంగల్ జిల్లాల వామపక్ష పార్టీల

గుడిసెవాసుల కోసం వామపక్షాల పోరాట గర్జన

- గుడిసెల కూల్చివేతలకు నిరసనగా కలెక్టరేట్ ముట్టడికి యత్నం
- సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు సహా పలువురు నేతల అరెస్టు
- గుడిసెవాసులకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్
- 1న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, జూలై 6న సెక్రటేరియట్ ముట్టడికి పిలుపు

ప్రజానావ, వరంగల్: గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం వరంగల్‌లో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఇటీవల హనుమకొండ గోపాలపురం, గుండ్ల సింగారం ప్రాంతాల్లో గుడిసెల కూల్చివేతలకు నిరసనగా సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐయూ, సీపీఐ లిబరేషన్ తదితర పార్టీల ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్క్ నుంచి కలెక్టరేట్ వైపు ర్యాలీగా బయలుదేరిన వామపక్ష శ్రేణులను అదాలత్ జంక్షన్ వద్ద హనుమకొండ ఏసీపీ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అమరవీరుల స్థూపం ఎదుట కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అమరవీరుల స్తూపం వద్ద ఉద్రిక్తత..

వామపక్ష పార్టీలకు చెందిన వందలాది మంది కార్యకర్తలు అమరవీరుల స్తూపం వద్ద బైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర కార్యదర్శులను అరెస్టు చేసి తరలించే సమయంలో కార్యకర్తలు పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం నాయకులను సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తర్వాత వామపక్ష కార్యకర్తలు అదాలత్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ద్వితీయ శ్రేణి నాయకులతో పోలీసులు చర్చించి ఆందోళనను విరమింపజేశారు.

గుడిసెలు కూల్చితే పేదలు ప్రభుత్వాన్ని కూల్చుతారు: జాన్ వెస్లీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ పేదల గుడిసెలు కూల్చితే పేదలే ప్రభుత్వాన్ని కూల్చే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇండ్ల స్థలాలు కొనలేని నిరుపేదలే గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని చెప్పారు. పేదలను భయపెట్టే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని, మళ్లీ గుడిసెలు వేయకుండా ఖాళీ చేసిన భూముల్లో గోతులు తవ్వుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా అమలు చేయలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. జూలై 1న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, జూలై 6న హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేదలపై బస్మాసుర హస్తం: గుమ్మడి నర్సయ్య

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి ప్రభుత్వం ఇప్పుడు పేదలపై బస్మాసుర హస్తం పెడుతోందని విమర్శించారు. అర్ధరాత్రి పేదల గుడిసెలను కూల్చడం దుర్మార్గమని అన్నారు.

భూమాఫియాకు లబ్ధి చేకూర్చే కుట్ర: గాదెగోని రవి

ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి మాట్లాడుతూ ప్రభుత్వం భూమాఫియాకు భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గుడిసెవాసుల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, వివిధ వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల హక్కు కోసం ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం: సాంబశివరావు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం స్ఫూర్తితో పేదల ఇండ్ల స్థలాల కోసం మరోసారి పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. పోరాటాల గడ్డ అయిన ఓరుగల్లులోనే మరోసారి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. పేదలకు ఇండ్ల స్థలాలు లేకపోవడం బాధాకరమని, గోపాలపురం, గుండ్ల సింగారం ప్రాంతాల్లో పేదలు నిర్మించుకున్న గుడిసెలను అన్యాయంగా కూల్చివేశారని ఆరోపించారు. ప్రభుత్వం తన ప్రతాపాన్ని పేదలపై కాకుండా భూకబ్జాదారులపై చూపించాలని సూచించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సుమారు 1400 మందికి పట్టాలు ఇచ్చారని, ఇటీవల కూడా కొందరికి పంపిణీ చేశారని గుర్తుచేశారు. జూలై 6న వేలాది మంది దరఖాస్తులతో రాష్ట్ర సచివాలయానికి వెళ్లనున్నట్లు ప్రకటించారు. అధికారులు స్వీకరించకపోతే సచివాలయంలోనే నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

పంట దిగుబడిని ముందే చెప్పే ఏఐ మోడల్ అభివృద్ధి

- శాటిలైట్ చిత్రాలు, వాతావరణ సమాచారంతో కచ్చితమైన అంచనా
- చండీగఢ్ యూనివర్సిటీ పరిశోధకుల వినూత్న ఆవిష్కరణ

చండీగఢ్: వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగానికి మరో కీలక ముందడుగు పడింది. చండీగఢ్ యూనివర్సిటీ పరిశోధకులు శాటిలైట్ చిత్రాలు, వాతావరణ సమాచారం, గత పంటల ఉత్పత్తి గణాంకాలను సమన్వయం చేసి పంట దిగుబడిని కోతకు ముందే అత్యంత ఖచ్చితత్వంతో అంచనా వేయగల ఏఐ ఆధారిత ట్రాన్స్‌ఫార్మర్ మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ సాంకేతికత రైతులు, ప్రభుత్వాలు, వ్యవసాయ సంస్థలు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో కీలకంగా ఉపయోగపడనుంది. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొ.కుసుమ్ లత నేతృత్వంలో ప్రొ. డా.నవ్‌నీత్ కౌర్, డా.సిమ్రందీప్ సింగ్ ఈ పరిశోధన చేపట్టారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన సెంటినెల్–1, సెంటినెల్–2 ఉపగ్రహాల నుంచి సేకరించిన పంట పెరుగుదల, వృక్ష ఆరోగ్యం, నేల తేమ, పొలాల పరిస్థితుల సమాచారాన్ని వర్షపాతం, ఉష్ణోగ్రత, చారిత్రక దిగుబడి వివరాలతో కలిపి ఈ మోడల్ పనిచేస్తుంది.

రైతులకు నిర్ణయాల్లో తోడ్పాటు

ఈ ఏఐ మోడల్ ద్వారా కోతకు ముందే పంట దిగుబడిని అంచనా వేయడం వల్ల రైతులు సాగు ప్రణాళికలు, నీటి వినియోగం, ఎరువుల నిర్వహణ, మార్కెటింగ్, పంట బీమా వంటి అంశాల్లో ముందస్తు నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. అలాగే ప్రభుత్వాలు ఆహార భద్రత, నిల్వలు, మార్కెట్ నిర్వహణ, వ్యవసాయ విధానాల రూపకల్పనలో మరింత సమర్థవంతంగా వ్యవహరించగలవని పరిశోధకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ వ్యవస్థను క్లౌడ్ ఆధారిత వేదికలతో అనుసంధానించి, వాస్తవ సమయానికి దగ్గరగా పంట దిగుబడి అంచనాలు అందించేలా మరింత అభివృద్ధి చేయనున్నట్లు పరిశోధక బృందం వెల్లడించింది.

సంప్రదాయ పద్ధతుల కంటే మెరుగైన ఫలితాలు

ఈ మోడల్‌ను పంజాబ్‌లోని లూథియానా జిల్లాలో వరి, మొక్కజొన్న, పెసర, చెరకు పంటలపై 2019–2023 మధ్య సేకరించిన డేటాతో పరీక్షించారు. ప్రస్తుతం విస్తృతంగా ఉపయోగిస్తున్న ర్యాండమ్ ఫారెస్ట్, ఎల్ఎస్‌టీఎం (ఎల్ఎస్‌టీఎం) వంటి మెషీన్ లెర్నింగ్ మోడళ్లతో పోలిస్తే ఇది మరింత కచ్చితమైన అంచనాలు ఇవ్వడంతో పాటు తక్కువ లోపాలు, వేగవంతమైన పనితీరును కనబరిచిందని పరిశోధకులు తెలిపారు. సాధారణ ట్రాన్స్‌ఫార్మర్ మోడళ్లతో పోలిస్తే ఈ కొత్త మోడల్‌కు దాదాపు 40 శాతం తక్కువ కంప్యూటింగ్ వనరులు సరిపోతాయని పరిశోధకులు వెల్లడించారు. దీంతో ప్రాంతీయ స్థాయిలో పంటల పర్యవేక్షణ, దిగుబడి అంచనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థల్లో దీన్ని సులభంగా వినియోగించే అవకాశం ఉందన్నారు.

నాలుగు తరాల న్యాయపోరాటానికి తెర!

- హరిద్వార్ భూమిపై కొనుగోలుదారుల వారసులకు ఊరట
- 70 ఏళ్ల భూ వివాదానికి ముగింపు పలికిన సుప్రీం
- 1957 సేల్‌డీడ్ చెల్లుబాటేనని స్పష్టం చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- చిన్న సాంకేతిక లోపాలతో హక్కులు కాదనలేమని వ్యాఖ్య

న్యూఢిల్లీ: దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ యాజమాన్య వివాదానికి సుప్రీంకోర్టు ఎట్టకేలకు ముగింపు పలికింది. 1957లో చట్టబద్ధంగా నమోదైన సేల్‌డీడ్‌ను చెల్లుబాటయ్యేదిగా గుర్తిస్తూ కొనుగోలుదారుల వారసులకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. స్వల్ప సాంకేతిక లోపాలను సాకుగా చూపి చట్టబద్ధమైన రిజిస్టర్డ్ పత్రాన్ని చెల్లదని ప్రకటించడం సమంజసం కాదని స్పష్టం చేసింది. విశేషమేమిటంటే, ఈ కేసును విచారించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలు జన్మించక ముందే ఈ వివాదం ప్రారంభమైంది. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ జిల్లా నర్సీపూర్ కలాన్ గ్రామంలో 15.5 బిఘాల భూమిని సరాఫత్ అలీ కుటుంబం 1957 జూన్‌లో నమోదైన సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేసింది. అప్పటి నుంచి భూమి తమ స్వాధీనంలోనే ఉందని కుటుంబ సభ్యులు పేర్కొంటూ వచ్చారు. 1980లలో మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా రెవెన్యూ అధికారులు అనుమతించారు. అయితే 1991లో భూముల పునర్వ్యవస్థీకరణ సందర్భంగా రెవెన్యూ రికార్డుల్లో భూమిని విక్రయించిన వారి పేర్లే కొనసాగుతున్నట్లు గుర్తించారు. దీంతో బాధితులు అధికారులను ఆశ్రయించారు. అయితే అప్పటి భూచట్ట నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు జరగలేదని, సాక్షుల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని పేర్కొంటూ అధికారులు మ్యుటేషన్‌ను రద్దు చేయడంతో పాటు 1957 సేల్‌డీడ్‌ను కూడా చెల్లదని తేల్చారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ అక్కడ కూడా అనుకూల తీర్పు రాకపోవడంతో చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనం, సాక్షుల వివరాల్లోని స్వల్ప వ్యత్యాసాల ఆధారంగా చట్టబద్ధంగా నమోదైన సేల్‌డీడ్‌ను కొట్టివేయడం న్యాయసమ్మతం కాదని పేర్కొంది. రిజిస్టర్డ్ పత్రానికి చట్టపరంగా బలమైన విలువ ఉంటుందని స్పష్టం చేస్తూ, కొనుగోలుదారుల వారసుల హక్కులను సమర్థించింది. ఈ న్యాయపోరాటం కొనసాగుతున్న సమయంలోనే అసలు పిటిషనర్ సరాఫత్ అలీ మరణించగా, ఆయన వారసులు కేసును కొనసాగించారు. తాజా తీర్పుతో దాదాపు 70 ఏళ్లుగా, నాలుగు తరాలుగా సాగిన భూ వివాదానికి తెరపడటంతో కుటుంబ సభ్యులకు ఊరట లభించింది.

ఫ్లాట్ తీసుకున్నా.. పరిహారం కోరచ్చు!

- గృహ కొనుగోలుదారుల హక్కులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఇంటి స్వాధీనం తర్వాత కూడా బిల్డర్‌పై ఫిర్యాదు చేసే హక్కు ఉంటుందని స్పష్టీకరణ
- ఆలస్యానికి పరిహారం కోరడాన్ని అడ్డుకోలేమన్న ధర్మాసనం

ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా నిర్మాణంలో జాప్యం లేదా సేవల్లో లోపాలపై బిల్డర్ నుంచి పరిహారం కోరే హక్కు గృహ కొనుగోలుదారులకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇల్లు స్వీకరించిన తర్వాత కొనుగోలుదారు వినియోగదారు హోదా కోల్పోతాడని భావించడం సరికాదని పేర్కొంటూ, ఈ అంశంపై జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) 2016లో ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. ఢిల్లీలోని ఓ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలో 2003లో సభ్యత్వం పొంది ఫ్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఫ్లాట్‌ను ఎలాంటి అభ్యంతరం లేకుండా స్వాధీనం చేసుకున్నందున, ఫిర్యాదు దాఖలు చేసే సమయానికి సదరు వ్యక్తి వినియోగదారు కాదన్న జాతీయ కమిషన్ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఫ్లాట్ అప్పగింతను స్వీకరించడం వల్ల నిర్మాణంలో జరిగిన ఆలస్యం లేదా సేవల్లో లోపాలపై పరిహారం కోరే హక్కు పోదని స్పష్టం చేసింది. రియల్ ఎస్టేట్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో మధ్యవర్తిత్వం (ఆర్బిట్రేషన్)కు సంబంధించిన నిబంధన ఉన్నప్పటికీ, అది వినియోగదారుల ఫోరంను ఆశ్రయించే హక్కును పరిమితం చేయదని ధర్మాసనం పేర్కొంది. ఫిర్యాదు దాఖలు చేసే ముందు ఇంటిని స్వాధీనం చేసుకున్నారనే కారణంతో పిటిషనర్ వినియోగదారుడి హోదా కోల్పోయారని భావించరాదని జాతీయ కమిషన్‌కు సూచించింది. వస్తువుల్లో లోపాలు, సేవల్లో నిర్లక్ష్యం లేదా జాప్యం వంటి అంశాలపై వినియోగదారులు వినియోగదారుల రక్షణ చట్టం–1986 కింద న్యాయం కోరే పూర్తి హక్కు కలిగి ఉంటారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వినియోగదారులకు త్వరితగతిన, సమర్థవంతమైన న్యాయపరిష్కారం అందించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ధర్మాసనం పేర్కొంది.

మహారాష్ట్ర టెట్ ప్రశ్నపత్రం లీక్

- పరీక్షను వాయిదా వేసిన ప్రభుత్వం
- అంతర్రాష్ట్ర ముఠా ప్రమేయంపై అనుమానాలు
- ముగ్గురి అరెస్ట్.. సిట్‌తో విచారణకు సీఎం ఫడ్నవీస్ ఆదేశాలు
- ఆరు లక్షల మంది అభ్యర్థులపై ప్రభావం
- కొత్త పరీక్ష తేదీలు త్వరలో ప్రకటిస్తామని పరీక్ష మండలి వెల్లడి

ప్రజానావ, ముంబై/న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఆదివారం నిర్వహించాల్సిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)–2026 ప్రశ్నపత్రం లీక్ కావడంతో ప్రభుత్వం పరీక్షను నిరవధికంగా వాయిదా వేసింది. పరీక్షకు కేవలం ఒక రోజు ముందు ప్రశ్నపత్రం బయటపడటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆదేశించారు. థానే జిల్లా భివాండిలో టెట్ ప్రశ్నాపత్రాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బిహార్, హర్యానాకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఆదివారం జరగాల్సిన టెట్ అసలు ప్రశ్నపత్రాల ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విద్యాశాఖ అధికారులు పరిశీలించి అసలైనవేనని నిర్ధారించడంతో పరీక్షను వెంటనే వాయిదా వేస్తున్నట్లు మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రకటించింది. ఈ వ్యవహారం వెనుక అంతర్రాష్ట్ర ముఠా పనిచేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రశ్నాపత్రం లీక్‌కు మూలాలు ఎక్కడున్నాయో గుర్తించేందుకు ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపినట్లు వెల్లడించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు మహారాష్ట్ర పోటీ పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఘటనపై ముఖ్యమంత్రి ఫడ్నవీస్ పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే, రాష్ట్ర డీజీపీ సదానంద్ దాతేతో సమీక్ష నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. థానే జాయింట్ పోలీసు కమిషనర్ పంజాబ్‌రావు ఉగాలే నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

మూడు వారాల సమయం

టెట్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు సుమారు మూడు వారాల సమయం పట్టే అవకాశముందని పరీక్ష మండలి తెలిపింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తిరిగి నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని, అదనపు ఫీజు కూడా వసూలు చేయబోమని స్పష్టం చేసింది. సవరించిన పరీక్ష తేదీలను త్వరలో అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని వెల్లడించింది. ఇటీవల నీట్–యూజీ ప్రశ్నాపత్రం లీక్ ఘటన తర్వాత మరో కీలక పరీక్ష కూడా వాయిదా పడటంతో ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాయి. అయితే అభ్యర్థుల ప్రయోజనాలు, పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకే టెట్‌ను వాయిదా వేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

కాంగ్రెస్ విమర్శలు

టెట్ ప్రశ్నపత్రం లీక్ కావడంతో పరీక్షను వాయిదా వేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ప్రశ్నాపత్రం లీక్ ఘటన మాత్రమే కాదని, దేశ యువత భవిష్యత్తును దోచుకునే చర్య అని విమర్శించారు. మరో ప్రశ్నాపత్రం లీక్... మరో పరీక్ష రద్దు. ఈసారి మహారాష్ట్ర టెట్ అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించిన రాహుల్, దేశంలోని విద్యా, పరీక్షల వ్యవస్థను దోపిడీకి వేదికగా మార్చేశారని ఆరోపించారు. దీంతో లక్షలాది మంది యువత భవిష్యత్తుపై అభద్రత నెలకొంటోందని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈ ఘటనపై స్పందించారు. నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ, సీయూఈటీ పరీక్షల తర్వాత ఇప్పుడు టెట్ కూడా ప్రశ్నపత్రం లీక్‌కు గురికావడం ఆందోళనకరమని అన్నారు.

పరీక్షల విశ్వసనీయత దెబ్బతింది: దీప్కే

ప్రశ్నపత్రం లీక్ ఘటన పోటీ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం తర్వాత ఇప్పుడు మహారాష్ట్ర టెట్ కూడా లీక్ కావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

ఢిల్లీ, ఉత్తరాఖండ్‌కు ఉగ్ర ముప్పు హెచ్చరిక

- అనుమానాస్పద ఈ–మెయిల్‌తో అప్రమత్తమైన నిఘా సంస్థలు
- దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లలో భద్రత కట్టుదిట్టం
- రెండు రాష్ట్రాల్లో పోలీసుల హైఅలర్ట్

న్యూఢిల్లీ: ఉగ్రదాడుల ముప్పు పొంచి ఉందన్న నిఘా హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. రాబోయే రోజుల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందంటూ అనుమానాస్పద ఈ–మెయిల్ అందడంతో నిఘా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా ప్రముఖ దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, పోలీసు కార్యాలయాల వద్ద అదనపు బలగాలను మోహరించి విస్తృత తనిఖీలు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లోని కొన్ని కీలక ప్రాంతాలపై దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తూ ఒక ఈ–మెయిల్ వెలుగులోకి వచ్చింది. అందులో పలు దేవాలయాలు, ప్రభుత్వ భవనాలు, రైల్వే స్టేషన్లు, పోలీసు స్థావరాలతో పాటు కొందరు రాజకీయ ప్రముఖులను కూడా లక్ష్యాలుగా ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థలు పరిస్థితిని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసు, ఉత్తరాఖండ్ పోలీసులతో పాటు కేంద్ర నిఘా సంస్థలు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నాయి. రద్దీ ప్రాంతాలు, ప్రార్థనా మందిరాలు, రవాణా కేంద్రాలు, ప్రభుత్వ భవనాల వద్ద అదనపు భద్రత ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు బృందాలకు నిరంతర గస్తీ నిర్వహించాలని, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ–మెయిల్ మూలాలపై దర్యాప్తు

ఈ–మెయిల్ నిజస్వరూపాన్ని నిర్ధారించేందుకు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నిపుణులు ఈ–మెయిల్ డిజిటల్ ట్రయిల్‌ను పరిశీలిస్తూ, అది నిజమైన హెచ్చరికా లేదా ఎవరైనా భయాందోళనలు సృష్టించేందుకు పంపిన నకిలీ సందేశమా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, కర్ణప్రయాగ్ ప్రాంతాల్లో నిహంగ్ సిక్కులు, స్థానిక అధికారుల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో ఈ హెచ్చరిక రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ–మెయిల్‌కు ఆ ఘటనలతో ప్రత్యక్ష సంబంధం ఉందా లేదా అనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం ఎక్కడ, ఎప్పుడు దాడి జరిగే అవకాశం ఉందనే అంశంపై స్పష్టమైన సమాచారం లేనప్పటికీ, ఎలాంటి అవకాశాన్నీ కొట్టిపారేయకుండా భద్రతా సంస్థలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని అధికారులు సూచించారు.

ఆపరేషన్ సిందూర్‌పై రాజకీయ రగడ

- ఆరుగురు అమరవీరుల త్యాగాన్ని ఏడాదిపాటు దాచిపెట్టారని కాంగ్రెస్ ఆరోపణ
- రాజ్‌నాథ్ పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారా? అంటూ పవన్ ఖేరా ప్రశ్న
- తప్పుడు ప్రచారం జరుగుతోందంటూ ఆరోపణలను ఖండించిన రక్షణ శాఖ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ప్రాణత్యాగం చేసిన ఆరుగురు సైనికుల అమరత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు ప్రజలకు తెలియకుండా దాచిపెట్టిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అమరవీరులకు దక్కాల్సిన గౌరవాన్ని ప్రభుత్వం నిరాకరించిందని, ఇది సైనికుల త్యాగాన్ని అవమానించడమేనని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా విమర్శించారు. గత ఏడాది పార్లమెంట్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రసంగానికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న పవన్ ఖేరా, ఆ సమయంలో ఆరుగురు సైనికులు అమరులైన విషయం మంత్రికి తెలియకపోయి ఉండాలి లేదా తెలిసి కూడా పార్లమెంట్‌కు వాస్తవాలు చెప్పకుండా ఉండి ఉండాలి అని ఆరోపించారు. ఈ రెండింటిలో ఏది జరిగినా అది ఆందోళనకరమేనని వ్యాఖ్యానించారు.

ఆలస్యంగా గుర్తింపు

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, భారత వైమానిక దళానికి చెందిన ఒకరు కలిపి మొత్తం ఆరుగురు సైనికులు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని కాంగ్రెస్ పేర్కొంది. అయితే వారి త్యాగాన్ని ఏడాది పాటు అధికారికంగా ప్రకటించకపోవడం వల్ల వారి కుటుంబాలకు తగిన గౌరవం దక్కలేదని ఆరోపించింది. ఇటీవల న్యూఢిల్లీ లోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నంలో ఆరుగురు అమరవీరుల పేర్లు చెక్కించిన అనంతరమే ఈ విషయం వెలుగులోకి వచ్చిందని కాంగ్రెస్ పేర్కొంది. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగానికి తక్షణమే తగిన గుర్తింపు ఇవ్వాల్సిందని డిమాండ్ చేసింది.

తప్పుడు అర్థాలు వచ్చేలా ప్రచారం

కాంగ్రెస్ ఆరోపణలను కేంద్ర రక్షణ శాఖ ఖండించింది. సోషల్ మీడియాలో రక్షణ మంత్రి ప్రసంగంలోని ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తూ తప్పుడు అర్థాలు వచ్చేలా ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక దళానికి చెందిన పైలట్లు మరణించారనే ప్రచారాన్ని ఖండించే సందర్భంలో చేసినవేనని, వాటిని వక్రీకరించి రాజకీయ ఆరోపణలు చేయడం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేసింది.

చైనాతో బంగ్లా బంధాలకు కొత్త ఊపు

- తారిక్ రహ్మాన్ పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలు అత్యున్నత స్థాయికి
- వ్యూహాత్మక సంభాషణలు, రక్షణ సహకారానికి కొత్త యంత్రాంగం
- తీస్తా ప్రాజెక్టు, బీఆర్ఐ, మౌలిక వసతుల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
- 12 ఒప్పందాలతో ఆర్థిక, వాణిజ్య, పెట్టుబడి రంగాలకు మరింత ఊతం

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రహ్మాన్ చైనా పర్యటనతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్త శిఖరాలను అధిరోహించాయని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రహ్మాన్ తెలిపారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసిందని, ప్రాంతీయ దౌత్యంలో బంగ్లాదేశ్ ప్రాధాన్యాన్ని పెంచిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని చైనా పర్యటన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. విదేశాంగ మంత్రుల స్థాయిలో శాశ్వత స్ట్రాటజిక్ డైలాగ్‌ను ప్రారంభించడంతో పాటు విదేశాంగ, రక్షణ అంశాలపై 2+2 చర్చల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయని వెల్లడించారు. ఈ నిర్ణయాలు భవిష్యత్తులో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించనున్నాయని చెప్పారు. చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) కింద మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తరించేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని వేగవంతం చేయడానికి చైనా పూర్తి సహకారం అందించనున్నట్లు హామీ ఇచ్చింది. మోంగ్లా పోర్టు ఆధునికీకరణ, విస్తరణ ప్రాజెక్టుతో పాటు చిట్టగాంగ్‌లో చైనా ఆర్థిక, పారిశ్రామిక మండలి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ ప్రాజెక్టులు బంగ్లాదేశ్ ఆర్థికాభివృద్ధికి కీలక మలుపు తిప్పనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

12 కీలక ఒప్పందాలు

ఐదు రోజుల చైనా పర్యటనలో ప్రధాని తారిక్ రహ్మాన్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ప్రధాని లీ చియాంగ్‌లతో విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి, వ్యవసాయం, విద్య, వాణిజ్యం, పెట్టుబడులు, మానవ వనరుల అభివృద్ధి, మీడియా సహకారం తదితర రంగాల్లో ఎనిమిది అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు), మూడు ద్వైపాక్షిక ఒప్పందాలు, ఒక ప్రొటోకాల్, ఒక సంయుక్త కార్యాచరణ ప్రణాళికపై సంతకాలు జరిగాయి. అలాగే బంగ్లాదేశ్ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించడంలో, విదేశీ జోక్యాన్ని ఎదుర్కోవడంలో చైనా పూర్తి మద్దతుగా నిలుస్తుందని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భరోసా ఇచ్చినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ పరిణామాలు ఆసియాలో చైనా–బంగ్లాదేశ్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త బలం చేకూర్చాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు ట్రంప్

- ధ్రువీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో
- భారత్ - యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటి ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్–అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ– ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ–ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించా రు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్–అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ డా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయన దక్కుతుందన్నారు.

12 ఏళ్ల నిరీక్షణకు తెర!

- మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్ సంచలనం
- రాణించిన ఓర్లా ప్రెండర్‌గాస్ట్
- వెస్టిండీస్‌పై ఆరు వికెట్ల విజయం
- 21 వరుస ఓటముల తర్వాత ఇదే తొలి గెలుపు

బ్రిస్టల్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. గత 12 ఏళ్లుగా ప్రపంచకప్‌లో వెంటాడుతున్న ఓటముల పరంపరకు తెరదించుతూ వెస్టిండీస్‌పై ఆరు వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. ఐదు ప్రపంచకప్‌లలో వరుసగా 21 మ్యాచ్‌లు ఓడిన ఐర్లాండ్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ (22), డియాండ్రా డాటిన్ (21), చినెల్లె హెన్రీ (27 నాటౌట్) మాత్రమే రాణించగా, ఐర్లాండ్ బౌలర్లు కారా ముర్రే, ఐమీ మాగ్వైర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. 129 పరుగుల లక్ష్యాన్ని ఐర్లాండ్ 18.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓర్లా ప్రెండర్‌గాస్ట్ 44 బంతుల్లో 63 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి విజయానికి బాటలు వేసింది. చివర్లో రెబెక్కా స్టోకెల్, లూయిస్ లిటిల్ జట్టును విజయతీరాలకు చేర్చగా, లిటిల్ బౌండరీతో మ్యాచ్‌ను ముగించింది. ఈ ఓటమితో వెస్టిండీస్ సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ న్యూజిలాండ్‌కు సెమీస్ రేసులో ఆశలు సజీవంగా నిలిచాయి.

పాక్‌కు ఊరట విజయం

ఇక మరో మ్యాచ్‌లో పాకిస్థాన్ 37 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ ఆరు వికెట్లకు 126 పరుగులు చేసింది. గుల్ ఫిరోజా అజేయంగా 63 పరుగులతో రాణించింది. అనంతరం నెదర్లాండ్స్‌ను 89 పరుగులకే ఆలౌట్ చేసి టోర్నీలో పరువు నిలబెట్టుకుంది. అయేషా జాఫర్, కెప్టెన్ ఫాతిమా మూడేసి వికెట్లు తీశారు.

ఆసీస్‌పై దూకుడుగా..

- సెమీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిందే
- ఆస్ట్రేలియాతో అంతరం బాగా తగ్గింది
- మేం ఒత్తిడిని ఎదుర్కొనే స్థాయికి ఎదిగాం
- టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన

లండన్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ అవకాశాలను నిలబెట్టుకోవాలంటే ఆస్ట్రేలియాతో జరిగే కీలక మ్యాచ్‌లో దూకుడైన క్రికెట్ ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నామని భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన స్పష్టం చేసింది. ఆదివారం జరిగే ఈ మ్యాచ్ తమకు డూ ఆర్ డై వంటిదేనని, విజయమే ఏకైక లక్ష్యంగా బరిలోకి దిగుతున్నామని తెలిపింది. మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన మంధాన, టోర్నీలో ఇప్పటివరకు బ్యాటింగ్ విభాగం ఆశించిన స్థాయిలో రాణించలేదని అంగీకరించింది. అయితే కీలక పోరులో ప్రతి బ్యాటర్ సానుకూల దృక్పథంతో, దూకుడుగా ఆడేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొంది. మంచి ఆరంభం లభిస్తే భారీ స్కోరు నమోదు చేసి మ్యాచ్‌పై పట్టు సాధించగలమనే విశ్వాసం వ్యక్తం చేసింది. గత నాలుగైదేళ్లలో భారత జట్టు ఆటతీరులో గణనీయమైన మార్పు వచ్చిందని, ఆస్ట్రేలియాతో తమ మధ్య ఉన్న అంతరం కూడా బాగా తగ్గిందని మంధాన పేర్కొంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), బిగ్‌బ్యాష్ వంటి ప్రతిష్ఠాత్మక లీగ్‌లలో భారత క్రికెటర్లు ఆడుతున్న అనుభవం ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచిందని చెప్పింది. అదే ఆత్మవిశ్వాసం ఇప్పుడు జట్టుకు బలంగా మారిందని వివరించింది.

షెఫాలీ ఆటపై సంతోషంగా ఉన్నా..

ఓపెనర్ షెఫాలీ వర్మతో కలిసి మరోసారి భారత్‌కు శుభారంభం అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు మంధాన వెల్లడించింది. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా, ఈ మ్యాచ్‌లో బలమైన భాగస్వామ్యంతో జట్టుకు పటిష్ఠమైన పునాది వేయాలని భావిస్తున్నట్లు తెలిపింది. షెఫాలీ ప్రస్తుతం బంతిని ధైర్యంగా ఆడుతున్న తీరు సంతోషాన్ని కలిగిస్తోందని, ఇద్దరి భాగస్వామ్యం జట్టు విజయానికి కీలకమవుతుందనే నమ్మకం వ్యక్తం చేసింది. ఇటీవల ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కరతో బ్యాటింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం దక్కిందని మంధాన తెలిపింది. ముఖ్యంగా బ్యాట్ గ్రిప్, షాట్ల ఎంపిక, ఇన్నింగ్స్‌ను నిర్మించే విధానంపై హేడెన్ అందించిన సూచనలు తనకు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని మ్యాచ్‌లో అమలు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించింది.

రచిన్ రవీంద్ర అర్ధశతకం

- ఇంగ్లండ్‌పై కివీస్ 204 పరుగుల ఆధిక్యం

నాటింగ్‌హామ్: ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జరుగుతున్న సిరీస్ నిర్ణయాత్మక మూడో టెస్టులో న్యూజిలాండ్ విజయంపై పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగుల ఆధిక్యం సాధించిన కివీస్, రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసి మొత్తం 204 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రచిన్ రవీంద్ర అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ 60 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతనికి డారిల్ మిచెల్ (26 నాటౌట్) అండగా నిలిచాడు. ఓపెనర్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వేలు కేవలం 12 పరుగులకే పెవిలియన్ చేరిన తర్వాత క్రీజులోకి వచ్చిన రవీంద్ర, హెన్రీ నికోల్స్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అనంతరం మిచెల్‌తో కలిసి మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పి వరుసగా రెండో టెస్టులోనూ అర్ధశతకం నమోదు చేశాడు. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 354 పరుగులకు ఆలౌటైంది. దీంతో న్యూజిలాండ్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగుల ఆధిక్యం లభించింది. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండో ఇన్నింగ్స్‌లో లాథమ్, కాన్వే వికెట్లు తీయడంతో ఆరంభంలో కివీస్‌ను కుదిపినా, రచిన్ రవీంద్ర నిలకడైన బ్యాటింగ్‌తో జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండడంతో మ్యాచ్‌పై న్యూజిలాండ్ పూర్తి ఆధిపత్యం కొనసాగిస్తోంది.

సెరెనా రీఎంట్రీ స్ఫూర్తిదాయకం

- ప్రైమ్‌లో ఉన్నప్పటి కంటే ఇప్పుడు మరింత కష్టపడుతోంది
- వింబుల్డన్‌లో పునరాగమనంపై జొకోవిచ్

లండన్: నాలుగేళ్ల విరామం తర్వాత వింబుల్డన్ సింగిల్స్‌లో మళ్లీ బరిలోకి దిగుతున్న టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌కు ప్రపంచ టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ ప్రశంసలు కురిపించాడు. ఆమె పునరాగమనం స్ఫూర్తిదాయకమే కాకుండా చారిత్రాత్మకమని కొనియాడాడు. వింబుల్డన్ ప్రారంభానికి ముందే సెరెనా రీఎంట్రీ టోర్నీ ప్రధాన ఆకర్షణగా మారిందని పేర్కొన్నాడు. 44 ఏళ్ల సెరెనా గతంలో తన కెరీర్ అత్యున్నత స్థాయిలో ఉన్నప్పటి కంటే ఇప్పుడు జిమ్‌లో మరింత కఠినంగా శిక్షణ తీసుకుంటోందని జొకోవిచ్ తెలిపాడు. ఈ పునరాగమనం విజయవంతం కావాలనే పట్టుదల ఆమె కసరత్తుల్లో కనిపిస్తోంది. సెరెనా కెరీర్, పోరాట స్ఫూర్తి ఎప్పుడూ నాకు ప్రేరణ. అలాగే ఆమె సోదరి వీనస్ విలియమ్స్ ప్రయాణం కూడా ఎంతో గొప్పది అని ఆయన అన్నారు.

నాలుగేళ్ల తర్వాత సింగిల్స్‌లోకి..

2022 యూఎస్ ఓపెన్ తర్వాత టెన్నిస్‌కు దూరమైన సెరెనా విలియమ్స్ ఈసారి వైల్డ్‌కార్డ్‌తో వింబుల్డన్ సింగిల్స్‌లోనూ, తన సోదరి వీనస్‌తో కలిసి మహిళల డబుల్స్‌లోనూ పోటీపడనుంది. మంగళవారం తొలి రౌండ్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ మాయా జాయింట్‌తో ఆమె తలపడనుంది. మూడో రౌండ్‌కు చేరితే డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్‌తో మ్యాచ్ ఆడే అవకాశం ఉంది. ప్రపంచ నంబర్‌వన్ ఆర్యనా సబలెంకా కూడా సెరెనా పునరాగమనాన్ని స్వాగతించింది. తన పిల్లలు తన ఆటను చూడాలనే ఉద్దేశంతో సెరెనా మళ్లీ కోర్టులోకి వస్తోందని విన్నాను. ఇది టెన్నిస్‌కు ఎంతో మంచి పరిణామం. ఆమె రీఎంట్రీతో ప్రపంచవ్యాప్తంగా టెన్నిస్‌పై మరింత ఆసక్తి పెరుగుతుంది. ఆమె ఆటను సెందుకు నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అని సబలెంకా పేర్కొంది.

Business
బిజినెస్

కొటక్ మహీంద్రా బ్యాంక్ సీఈవో పదవికి

అశోక్ వాస్వానీ గుడ్‌బై

- మూడేళ్ల పదవీకాలం పూర్తయ్యాక వైదొలగనున్న ఎండీ, సీఈవో
- వ్యక్తిగత కారణాలతో పొడిగింపు కోరనని స్పష్టం
- కొత్త సీఈవో ఎంపిక ప్రక్రియ ప్రారంభం

న్యూఢిల్లీ: కొటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) అశోక్ వాస్వానీ తన పదవికి వైదొలగనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత మూడేళ్ల పదవీకాలం ఈ ఏడాది డిసెంబర్ 31తో ముగియనుండగా, ఆ తర్వాత తిరిగి నియామకం కోరబోనని బ్యాంకు బోర్డుకు తెలియజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పదవీకాలాన్ని పొడిగించుకునే ఆసక్తి లేదని వాస్వానీ బోర్డుకు సమాచారం ఇచ్చినట్లు కొటక్ మహీంద్రా బ్యాంక్ నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. ఆయన నిర్ణయాన్ని గౌరవించిన బోర్డు, కొత్త ఎండీ, సీఈవో నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపింది. నియంత్రణ సంస్థల మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని పేర్కొంది. అశోక్ వాస్వానీ 2024 జనవరి 1న కొటక్ మహీంద్రా బ్యాంక్ ఎండీ, సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు బార్క్లేస్, సిటీగ్రూప్ వంటి అంతర్జాతీయ బ్యాంకుల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. బ్యాంకు వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ 2023 సెప్టెంబర్‌లో పదవికి రాజీనామా చేసిన అనంతరం తాత్కాలిక సీఈవో దీపక్ గుప్తా స్థానంలో వాస్వానీ నియమితులయ్యారు.

లాభాల్లో వృద్ధి నమోదు

2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కొటక్ మహీంద్రా బ్యాంక్ సమీకృత నికర లాభం 10 శాతం పెరిగి రూ.5,423 కోట్లకు చేరుకుంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఇది రూ.4,933 కోట్లుగా ఉంది. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం 13 శాతం పెరిగి రూ.4,027 కోట్లకు చేరింది.

హోమ్ లోన్‌లో ఈ తప్పులు వద్దు!

తప్పుడు నిర్ణయాలతో లక్షల రూపాయల అదనపు భారం

- తక్కువ ఈఎంఐ మోజు.. ఎక్కువ వడ్డీ బాదుడు
- వడ్డీ రేటు మాత్రమే కాదు.. మొత్తం ఖర్చుపై దృష్టి పెట్టాలి
- ఆస్తి పత్రాల పరిశీలనలో నిర్లక్ష్యం చేస్తే భారీ నష్టం
- రుణ కాలపరిమితి, వడ్డీ విధానం అప్రమత్తత అవసరం
- చిన్న జాగ్రత్తలతో భారీ ఆర్థిక నష్టాన్ని తప్పించుకోవచ్చు

సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి హోమ్ లోన్ అత్యంత కీలకమైన ఆర్థిక నిర్ణయం. అయితే రుణం తీసుకునే సమయంలో చేసే చిన్నచిన్న పొరపాట్లు రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో లక్షల రూపాయల అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడ్డీ రేటు మాత్రమే చూసి బ్యాంకును ఎంపిక చేయడం, ఎక్కువ కాలపరిమితిని ఎంచుకోవడం, ఆస్తి చట్టపరమైన అంశాలను పట్టించుకోకపోవడం, అదనపు ఖర్చులను అంచనా వేయకపోవడం వంటి తప్పులు చివరికి భారీ మూల్యం చెల్లించే పరిస్థితికి దారితీస్తాయని సూచిస్తున్నారు. హోమ్ లోన్ తీసుకునే సమయంలో చాలా మంది కేవలం తక్కువ వడ్డీ రేటు ఉన్న బ్యాంకునే ఎంచుకుంటారు. కానీ ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, లీగల్ వెరిఫికేషన్, టెక్నికల్ ఛార్జీలు, బీమా ప్రీమియం వంటి ఇతర ఖర్చులు కలిపి చూస్తే మొత్తం రుణ వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే అన్నిరకాల ఛార్జీలను పరిగణనలోకి తీసుకుని రుణదాతను ఎంపిక చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

తక్కువ కాల వ్యవధితో భారం తగ్గింపు

నెలవారీ ఈఎంఐ తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఎక్కువ కాలపరిమితి ఎంచుకుంటే చివరకు చెల్లించే వడ్డీ లక్షల్లో పెరుగుతుంది. ఆదాయానికి అనుగుణంగా సాధ్యమైనంత తక్కువ కాలవ్యవధిని ఎంచుకోవడం ద్వారా మొత్తం రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముందుగా ఇల్లు ఎంపిక చేసి, తర్వాత రుణం కోసం ప్రయత్నించడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. రుణ అర్హత ఎంత ఉందో ముందుగానే తెలుసుకుని, దానికి అనుగుణంగా బడ్జెట్ రూపొందించుకుంటే ఆర్థిక ఒత్తిడిని నివారించవచ్చు. బ్యాంకు పరిశీలన చేస్తోందనే నమ్మకంతో ఆస్తి చట్టపరమైన అంశాలను నిర్లక్ష్యం చేయరాదు. యాజమాన్య హక్కులు, రేరా నమోదు, పెండింగ్ బకాయిలు, ఇతర వివాదాలపై న్యాయ నిపుణులతో ప్రత్యేకంగా పరిశీలన చేయించుకోవడం ఇబ్బందులను నివారిస్తుంది.

ఏది సరైనది?

ఫిక్స్‌డ్ వడ్డీ రేటులో ఈఎంఐ స్థిరంగా ఉంటుంది. ఫ్లోటింగ్ రేటులో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వడ్డీ మారుతుంది. కాబట్టి తమ ఆదాయం, భవిష్యత్ ఆర్థిక పరిస్థితులు, రుణ కాలపరిమితిని దృష్టిలో ఉంచుకుని సరైన విధానాన్ని ఎంచుకోవడం ద్వారా అనవసరమైన ఆర్థిక భారాన్ని నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

డౌన్ పేమెంట్‌తో పని పూర్తికాదు

డౌన్ పేమెంట్‌తో పాటు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఛార్జీలు, ఇంటీరియర్ పనులు, ఇతర అనుబంధ ఖర్చులకు కూడా ముందుగానే నిధులు సిద్ధం చేసుకోవాలి. లేదంటే చివరి దశలో నగదు కొరత ఏర్పడే అవకాశం ఉంటుంది. హోమ్ లోన్ తీసుకున్నాక కూడా వడ్డీ రేట్లు తగ్గితే బ్యాంకును సంప్రదించి తగ్గింపు కోరడం, అదనపు ఆదాయం వచ్చినప్పుడు పాక్షికంగా రుణం చెల్లించడం, రుణ ఒప్పందంలోని నిబంధనలను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు.

కాండెరె బ్రాండ్ అంబాసిడర్‌గా స్మృతి మంధాన

- కళ్యాణ్ జ్యువెలర్స్ లైఫ్‌స్టైల్ జ్యువెలరీ బ్రాండ్‌కు స్టార్ క్రికెటర్ ఎంపిక
- యువతతో మరింత అనుబంధమే లక్ష్యం.. షారుఖ్ ఖాన్‌తో కలిసి ప్రచారం

ముంబై: కళ్యాణ్ జ్యువెలర్స్‌కు చెందిన లైఫ్‌స్టైల్ జ్యువెలరీ బ్రాండ్ కాండెరె తన కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతి మంధానను నియమించింది. యువతతో మరింత బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకునే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ శనివారం వెల్లడించింది. స్మృతి మంధాన కష్టపడి ఎదిగిన తరం ప్రతినిధిగా, ఆత్మవిశ్వాసం, నిజాయితీ, లక్ష్యసాధనకు ప్రతీకగా నిలిచారని కాండెరె డైరెక్టర్ రమేశ్ కళ్యాణరామన్ పేర్కొన్నారు. ఆమె విజయాలు, వ్యక్తిత్వం దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతకు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు.

షారుఖ్‌తో కలిసి ప్రచారంలో

ప్రస్తుతం కాండెరె బ్రాండ్‌కు ప్రచారకర్తగా ఉన్న బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌తో పాటు ఇకపై స్మృతి కూడా బ్రాండ్ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. దేశంలోని విభిన్న భావజాలం, జీవనశైలిని ఈ ఇద్దరూ ప్రతిబింబిస్తారని సంస్థ పేర్కొంది. దేశవ్యాప్తంగా వినియోగదారులతో మరింత చేరువ కావడంలో స్మృతి మంధాన భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని కాండెరె యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు లీగల్ క్లీన్‌చీట్

- మాజీ చైర్మన్ ఆరోపణలకు ఆధారాలు లేవన్న స్వతంత్ర న్యాయ సంస్థలు

న్యూఢిల్లీ: మాజీ చైర్మన్ అతను చక్రవర్తి చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లభించలేదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. స్వతంత్రంగా రెండు ప్రముఖ న్యాయ సంస్థలు నిర్వహించిన సమగ్ర పరిశీలనలో ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్న ఆరోపణలు, అనంతరం చేసిన వ్యాఖ్యలకు రికార్డుల్లో ఎలాంటి బలమైన ఆధారాలు కనిపించలేదని తేలినట్లు తెలిపింది. విల్సన్ సొన్సినీ గుడ్‌రిచ్ అండ్ రోసాటి, వాడియా ఘాండీ అండ్ కో న్యాయ సంస్థలు మూడు నెలల పాటు విచారణ చేపట్టాయి. గత రెండేళ్ల బోర్డు, కమిటీ సమావేశాల మినిట్స్, అజెండాలు, వేలాది పత్రాలను పరిశీలించడంతో పాటు స్వతంత్ర డైరెక్టర్లు, కమిటీ చైర్మన్లు, ఎండీ, సీఈవో, కీలక విభాగాధిపతులను ప్రశ్నించినట్లు బ్యాంక్ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. బోర్డు సమావేశాల్లో తన అభ్యంతరాలను నమోదు చేసుకునే అవకాశం అతను చక్రవర్తికి ఉన్నప్పటికీ, అలాంటి ఎలాంటి రికార్డులు లభించలేదని న్యాయ సంస్థలు గుర్తించాయి. బోర్డు మినిట్స్, సమావేశ పత్రాలు, ఇతర అధికారిక రికార్డుల్లో ఆయన ఆరోపణలను సమర్థించే ఆధారాలు ఏవీ కనిపించలేదని పేర్కొన్నాయి. సాక్షుల వాంగ్మూలాలు కూడా ఆయన ఆరోపణలను బలపరచలేదని స్పష్టం చేశాయి.

సహకరించని మాజీ చైర్మన్

విచారణలో భాగంగా మాజీ చైర్మన్ అతను చక్రవర్తిని పలుమార్లు ఇంటర్వ్యూకు ఆహ్వానించినప్పటికీ ఆయన పాల్గొనలేదని బ్యాంక్ తెలిపింది. అయినప్పటికీ అందుబాటులో ఉన్న అన్ని పత్రాలు, రికార్డుల ఆధారంగా సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు పేర్కొంది. రాజీనామా అనంతరం అతను చక్రవర్తి ప్రస్తావించిన దుబాయ్ బ్రాంచ్ వ్యవహారాన్ని కూడా న్యాయ సంస్థలు పరిశీలించాయి.

బాహుబలి' డాక్యుమెంటరీలో

మెరిసిన ప్రభాస్–అనుష్క జోడీ

భారతీయ సినీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించిన 'బాహుబలి' సిరీస్ ప్రభావం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ విజువల్ వండర్ ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని నమోదు చేసి, భారతీయ సినిమా స్థాయిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ముఖ్యంగా అమరేంద్ర బాహుబలిగా ప్రభాస్, దేవసేనగా అనుష్క శెట్టి నటనతో పాటు వీరిద్దరి మధ్య కనిపించిన కెమిస్ట్రీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రాంతీయ చిత్రంగా ప్రారంభమైన 'బాహుబలి' సిరీస్ ప్రపంచవ్యాప్తంగా రూ.2,400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది. ఈ చిత్రం ప్రారంభమై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా విడుదలైన 'బాహుబలి: ది టార్చ్‌బేరర్' డాక్యుమెంటరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ డాక్యుమెంటరీలో సినిమా నిర్మాణం వెనుక జరిగిన కఠిన శ్రమతో పాటు ప్రేక్షకులకు తెలియని అనేక ఆసక్తికర విషయాలను ఆవిష్కరించారు. ఇందులో ప్రభాస్, అనుష్క శెట్టి తమ పాత జ్ఞాపకాలను పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క, తమన్నా, నిర్మాత శోభు యార్లగడ్డ తదితరులు పంచుకున్న అనుభవాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఈ డాక్యుమెంటరీలో ప్రధానంగా అభిమానుల దృష్టిని ఆకర్షించిన అంశం ప్రభాస్–అనుష్క కలిసి కనిపించడం. చాలా కాలం తర్వాత వీరిద్దరూ ఒకే వేదికపై కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ జంటపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, తాము మంచి స్నేహితులమేనని ఇద్దరూ పలుమార్లు స్పష్టం చేశారు. డాక్యుమెంటరీలో అనుష్క సంప్రదాయ గ్రీన్ కలర్ దుస్తుల్లో ఆకట్టుకోగా, ప్రభాస్ బ్లాక్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించాడు. ఎంతోకాలం తర్వాత తమ అభిమాన జోడీని కలిసి చూసిన అభిమానులు సోషల్ మీడియాలో ఫొటోలను విస్తృతంగా షేర్ చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్–అనుష్క బాండింగ్ మరోసారి ప్రేక్షకుల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది.

సిద్దూ కోసం సుకుమార్ కొత్త ప్లాన్?

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ ఒకవైపు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో తన తదుపరి భారీ చిత్రానికి సన్నాహాలు చేస్తూనే, మరోవైపు నిర్మాతగా తన 'సుకుమార్ రైటింగ్స్' బ్యానర్‌ను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండే ఆయన, తాజాగా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇటీవల నటుడు ప్రియదర్శి హీరోగా ఓ కొత్త చిత్రాన్ని ప్రారంభించిన సుకుమార్, ఇప్పుడు యువ హీరో సిద్దూ జొన్నలగడ్డతో ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారని టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని సుకుమార్ సమర్పించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాతో సుకుమార్ వద్ద అసోసియేట్‌గా పనిచేస్తున్న బాబీ దర్శకుడిగా పరిచయం కానున్నట్లు సమాచారం. విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ యువతలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సిద్దూ జొన్నలగడ్డ, సుకుమార్ బ్యానర్‌తో జతకట్టనున్నాడన్న వార్త ఇండస్ట్రీలో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే 'కుమారి 21ఎఫ్', 'ఉప్పెన', 'విరూపాక్ష' వంటి వైవిధ్యభరితమైన విజయవంతమైన చిత్రాలను అందించిన 'సుకుమార్ రైటింగ్స్' బ్యానర్, టాలీవుడ్‌లో కొత్త దర్శకులకు వేదికగా నిలుస్తోంది. కమర్షియల్ అంశాలతో పాటు బలమైన కథాబలాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటూ ఈ బ్యానర్ పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించింది.

'రాకా'లో రష్మిక?

'పుష్ప రాజ్–శ్రీవల్లి' జోడీ మరోసారి వెండితెరపై కనిపించబోతోందా? ప్రస్తుతం సినీ వర్గాల్లో ఇదే అంశం హాట్ టాపిక్‌గా మారింది. అల్లు అర్జున్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రల్లో దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'రాకా'లో రష్మిక మందన్నా కూడా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, త్వరలో ముంబయిలో ప్రారంభం కానున్న కొత్త షూటింగ్ షెడ్యూల్‌లో రష్మిక కూడా పాల్గొననున్నారని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే 'పుష్ప' చిత్రంలో అల్లు అర్జున్ – రష్మిక జోడీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో మరోసారి వీరిద్దరూ కలిసి కనిపిస్తారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. అంతేకాకుండా, ఈ చిత్రంలో రష్మికతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రలు పోషించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్ కూడా ఈ సినిమాలో ఓ ముఖ్య పాత్రలో కనిపించనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ అంశాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు త్వరలో అట్లీ, అల్లు అర్జున్, దీపికా పదుకొణె ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఆ వేదికపై షారుక్ ఖాన్ ఈ సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ వెల్లడించే అవకాశమున్నట్లు సమాచారం. సుమారు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి సినిమా షూటింగ్‌ను పూర్తిచేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

జీ2పై అడివి శేష్ అంచనాలు..

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ వరుస విజయాలతో దూసుకెళ్తున్న యువ కథానాయకుడు అడివి శేష్, తన కెరీర్‌లో భారీ విజయాన్ని అందించిన స్పై థ్రిల్లర్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమాకు సంబంధించిన కీలక షూటింగ్ షెడ్యూల్ జూలై నెలలో ప్రారంభం కానుండగా, ఈ నేపథ్యంలో అడివి శేష్ తన కొత్త మేకోవర్ ఫొటోలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నాడు. క్లీన్ షేవ్ లుక్‌లో మరింత యంగ్‌గా, లీన్‌గా కనిపిస్తున్న ఆయన, పర్ఫెక్ట్ స్పై పాత్ర కోసం జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలుస్తోంది. 'తుఫాను ముందు వచ్చే నిశ్శబ్దం.. జూలైలో జీ2 షూటింగ్ ప్రారంభం కాబోతోంది' అంటూ చిత్ర బృందంతో కలిసి సన్నాహాలు చేస్తున్న ఫొటోలను శేష్ సోషల్ మీడియాలో షేర్ చేశాడు. దీంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. పాన్–ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో వామికా గబ్బి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్రలో కనిపించనున్నాడు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి.

తమిళ చిత్రసీమలో విషాదం

తమిళ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, దర్శకుడు, కథా రచయిత కె. భాగ్యరాజ్ (73) శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. సినీ రంగంలో తన ప్రత్యేక ముద్ర వేసిన ఆయన మరణం అభిమానులతో పాటు సినీ పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కె. భాగ్యరాజ్ పూర్తి పేరు కృష్ణస్వామి భాగ్యరాజ్. 1953లో తమిళనాడులో జన్మించిన ఆయన దర్శకులు జి. రామకృష్ణన్, భారతీరాజా వద్ద సహాయకుడిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం భారతీరాజా చిత్రాలకు కథలు, స్క్రిప్ట్‌లను అందించారు. 1979లో 'సువరిల్లద చిత్తిరంగల్' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. '16 వెయతినిలె' (తెలుగులో 'పదహారేళ్ల వయసు') చిత్రంతో తొలిసారి వెండితెరపై కనిపించిన భాగ్యరాజ్, ఆ తర్వాత నటుడిగా, దర్శకుడిగా, కథా రచయితగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. నటి ఊర్వశి, ఆమె సోదరి కల్పనలను సినీ పరిశ్రమకు పరిచయం చేయడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. సుమారు 75 చిత్రాల్లో నటించిన ఆయన, 25కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. 1983లో విడుదలైన 'ముందనై ముడిచ్చు' (తెలుగులో 'మూడు ముళ్లు') చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డును అందుకున్నారు. సినీ రంగానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 2014లో సైమా జీవిత సాఫల్య పురస్కారం ఆయనకు లభించింది. ఆయన రచించిన అనేక కథలు హిందీ, తెలుగు సహా పలు భాషల్లో రీమేక్ అయి ఘన విజయాలను అందుకున్నాయి. అమితాబ్ బచ్చన్ నటించిన 'ఆఖరి రాస్తా', అనిల్ కపూర్ నటించిన 'వో 7 దిన్' చిత్రాలకు కూడా కథ అందించారు. ఇటీవల తెలుగులో విడుదలైన '35 చిన్న కథ కాదు', 'కుబేర' చిత్రాల్లో కూడా కీలక పాత్రల్లో కనిపించారు. స్క్రీన్‌ప్లే మాంత్రికుడిగా గుర్తింపు పొందిన కె. భాగ్యరాజ్ మరణం తమిళ చిత్రసీమకు తీరని లోటుగా మారింది. ఆయన మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

నాకు అహంకారం లేదు!

సినీ రంగంలో ప్రముఖులపై వదంతులు రావడం కొత్త విషయం కాదు. ముఖ్యంగా సోషల్ మీడియా విస్తరణతో నిజాల కంటే ఊహాగానాలే వేగంగా ప్రచారంలోకి వస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ప్రముఖ నటి శ్రీలీల కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. యునైటెడ్ స్టేట్స్‌లో వైద్య విద్యను అభ్యసించిన శ్రీలీల, చిన్న వయసులోనే కన్నడ సినీ పరిశ్రమలో నటిగా అడుగుపెట్టారు. అనంతరం 'కిస్' చిత్రంలో కథానాయికగా నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'చిత్రాంగద' చిత్రంతో పరిచయమైనప్పటికీ, 'పెళ్లి సందడి' సినిమాతో మంచి గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత వచ్చిన 'ధమాకా' కమర్షియల్‌గా విజయం సాధించడంతో ఆమెకు మరింత క్రేజ్ పెరిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా కొనసాగుతున్న శ్రీలీల, 'పరాశక్తి' చిత్రంతో తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అంతేకాకుండా బాలీవుడ్‌లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. నటనతో పాటు తన డ్యాన్స్ ప్రతిభతో యువతలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. అయితే తాజాగా డ్యాన్స్ విషయంలో శ్రీలీల చేసినట్లు కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనతో పోటీ పడే హీరో లేదా హీరోయిన్ ఎవరూ లేరని ఆమె చెప్పినట్లు ప్రచారం జరిగింది. ఈ ప్రచారంపై శ్రీలీల స్పందిస్తూ ఆ వార్తలను పూర్తిగా ఖండించారు. అలాంటి అహంకారపూరిత వ్యాఖ్యలు తాను ఎప్పుడూ చేయలేదని స్పష్టం చేశారు. తాను అలాంటి వాతావరణంలో పెరగలేదని, అందరినీ గౌరవించే వ్యక్తినని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసే వారు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. తన గురించి నిజంగా తెలిసిన వారికి తానెలాంటి వ్యక్తినో తెలుసని శ్రీలీల తెలిపారు.

రజనీకాంత్ వివరణ బాధాకరం!



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై నటుడు రజనీకాంత్ అసూయతో ఉన్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన వార్తలపై తమిళ నటుడు విష్ణు విశాల్ తీవ్రంగా స్పందించారు. ఈ వివాదంపై రజనీకాంత్ స్వయంగా స్పందించి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. తన తాజా చిత్రం 'మట్టి కుస్తీ 2' ప్రమోషన్ల సందర్భంగా మాట్లాడిన విష్ణు విశాల్, సోషల్ మీడియాలో సెలబ్రిటీలకు సంబంధించిన వార్తలు, ఊహాగానాలపై అసహనం వ్యక్తం చేశారు. రజనీకాంత్ వంటి వ్యక్తి స్వయంగా తనకు విజయ్‌పై ఎలాంటి అసూయ లేదని చెప్పాల్సి రావడం చాలా బాధ కలిగించిందన్నారు. "నాలుగు రోజులు ఎవరైనా మౌనంగా ఉంటే చాలు, వెంటనే అనేక ఊహాగానాలు సృష్టిస్తున్నారు. కొన్ని విషయాల్లో రజనీకాంత్ మౌనం పాటించడాన్ని కూడా తప్పుగా అర్థం చేసుకున్నారు. చివరికి ఆయన మైక్ ముందు వచ్చి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి తీసుకువచ్చారు. తన సినీ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించిన వ్యక్తిపై కూడా అసూయ ఉందని ఆరోపించడం సరైనది కాదు. ఇది నిజంగా బాధాకరమైన విషయం" అని విష్ణు విశాల్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన రజనీకాంత్, "విజయ్ ముఖ్యమంత్రి అయితే నాకు ఎందుకు అసూయ ఉంటుంది?" అని ప్రశ్నించారు.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277